Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.11

September 2022



## నిలిచి ఉండే పరిచర్య

# జీవితాన్ని, పరిచర్యను పరీక్షించుకొందాం

ఐదు సంవత్సరాల క్రితం జక్కి దేవరాజుగారిని విద్యార్థుల పరిచర్యలో మీ అనుభవాల్ని చెప్పమని అడిగినప్పుడు ఒక అనుభవం గూర్చి ఇలా చెప్పారు. "1975వ సం॥ మచిలీపట్నంలో, దీనబంధుగారి క్యాంపస్‌లో జరిగే ఇవాంజలిస్టిక్ క్యాంప్‌కు నన్ను డైరెక్టర్‌గా ఉంచారు. బ్ర.జయనేంద్రకుమార్‌గారు కోఆర్డినేటర్‌గా ఉన్నారు. అప్పుడు నాకు 40 సంవత్సరాలు. డైరెక్టర్‌గా ఎలా చేయాలో నాకు తెలియదు. ఈ రోజుల్లో చాలా సులువుగా చేస్తున్నట్లుగా మన పద్ధతులు కూడా తెలియదు. నాకు తెలిసింది కేవలం ప్రార్థన చేయడం, సంపూర్ణంగా దేవునిమీద ఆధారపడడమే. క్యాంప్‌కు ఏ యే అవసరతలున్నాయో వాటన్నిటిని నోట్స్‌లో ఒక వైపు రాసుకున్నాను. రెండవవైపు ఆ అవసరానికి సంబంధించిన బైబిల్ వాగ్దానం రాసుకుని ప్రార్థన చేయడం మొదలు పెట్టాను. ఉదా. ఆర్థిక అవసరత ఒకవైపు, రెండవవైపు ఫిలిప్పీ 4:19. ఇలా ప్రతి అవసరం, దానికి సంబంధించిన బైబిల్ వాగ్దానం రాసుకుని అదేపనిగా ప్రార్థించేవాడిని. ఆ క్యాంప్ చాలా చక్కగా, అన్నీ సమకూడి జరిగింది. ఆ క్యాంప్‌లో రక్షింపబడినవారిలో చాలా మంది వరల్డ్ విజన్, మరికొన్నిటిలో మంచిస్థాయిలో ఉన్నారు. మా ప్రార్థన వ్యర్థం కాలేదు, ఫలితం కనబడింది.

ఈ రోజుల్లో క్యాంప్‌కు కాన్ఫరెన్స్‌కు డైరెక్టర్, కోఆర్డినేటర్, కమిటీ మెంబర్ అంటే ప్లానింగ్‌తో, పనులతో హడావుడిగా, అది చేయలేదు, ఇది చేయలేదని ఎంతో ఒత్తిడికి గురవుతూ, కుంగిపోతుంటారు. దేవునిమీద ఆధార పడాల్సినంతగా ఆధారపడడం లేదు. ప్రార్థన ఎక్కువగా చేయడం లేదు. ఎంత ఎక్కువగా ప్రార్థన చేస్తామో అంత ఎక్కువగా దేవునిమీద ఆధారపడుతున్నట్లు, ఆయన సహాయం కోరుతున్నట్లు. ఎంత తక్కువ ప్రార్థన చేస్తామో అంతగా మన అను భవం మీద ఆధారపడుతున్నట్లు. విద్యార్థుల్లో నిలిచి ఉండే ఫలం కనబడాలంటే, మన అను భవం కాదు దేవుడు కార్యం చేస్తేనే జరుగుతుంది" అని చెప్పారు.

1954లో యుఇయస్‌ఐ పరిచర్య ప్రారంభమైంది. మన పితరులు ఎంతో పరిశుద్ధంగా జీవిస్తూ, ప్రభువిచ్చిన దర్శనం ప్రకారం కన్నీటి ప్రార్థనతో సువార్తను విద్యార్థుల మధ్య నాటారు, నీరుపోశారు, దేవుడు ఈ పరిచర్యను ఊహించని రీతిగా అభివృద్ధి చేశాడు. ఇప్పుడు ఈ పరిచర్య బాధ్యతను దేవుడు మనకప్పగించాడు. మనం ఎలా చేస్తున్నాం? మనం ఎలా నాటుతున్నాం? ఎలా నీరుపోస్తున్నాం? దేవుడు మనం చేసే పనిని పరీక్షిస్తే అది నిలుస్తుందా? కాలిపోతుందా? అని ఎప్పటికప్పుడు మనం పరీక్షించుకోవాలి.

ఛార్లెస్ స్పర్జన్‌గారు స్వపరీక్ష గూర్చి నాలుగు విషయాలు చెబుతాడు. 1. స్వపరీక్ష కష్టమైనపని. ఎందుకంటే, మన ఆలోచనలు, పనులు, వైఫల్యాలను లోతుగా పరీక్షించుకోవడం చాలామందికి ఇష్టముండదు. కష్టంతో కూడినదిగా భావిస్తారు. 2. స్వపరీక్ష మన బాధ్యత. మన జీవితం, పని దేవునికి ఇష్టమైదిగా ఉండాలంటే ఖచ్చితంగా ఇది అవసరం. అపొస్తలుడైన పౌలు మొదటి మిషనరీ ప్రయాణంలో చేసిన పరిచర్యను రెండవ మిషనరీ ప్రయాణంలో పరీక్షించాడు. 3. స్వపరీక్షలో కొన్ని ప్రమాదాలు ఉన్నాయి. ఎందుకంటే స్వపరీక్ష చేసుకొన్నప్పుడు ఈ పరిస్థితులు మారవు అనే ఆలోచనతో నిరుత్సాహం, దిగులు, పరిచర్యను వదిలివేయడం లాంటి ప్రమాదాలు ఉంటాయి. 4. స్వపరీక్షతో ఫలితాలు మెరుగయ్యే అవకాశం ఉంది. లోటుపాటులను పరీక్షించుకొని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

"దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము, నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము నిత్య మార్గమున నన్ను నడిపింపుము" (కీర్తనలు 139: 23,24) అని దావీదు చెప్పినట్లు మనం కూడా చెబుదాం.

మన ఆత్మీయ జీవితాన్ని, చేసే పరిచర్యను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. ఎందుకంటే దేవుడు లెక్క అడుగుతాడు. రక్షణ పొందడమనేది నూతన జీవితానికి ప్రారంభం మాత్రమే. మన నిజమైన జీవితం అక్కడనుండి ప్రారంభమవుతుంది. అప్పటి వరకు మనం జీవించిన పాత జీవితాన్ని దేవుడు పరిగణలోకి తీసుకోడు. కానీ రక్షణ పొందిన క్షణంనుండి మన జీవితం దేవుని పరిశీలన కిందకు వస్తుంది. ఎలా జీవించాము, ఏ ఉద్దేశంతో పరిచర్య చేశాము, మన కుటుంబ సంబంధాలు, పనిచేసే చోటు, ఇయు/ఇజియఫ్ సభ్యులతో సంబంధాలు, మన నైతిక జీవితం, మన విరామ సమయాన్ని దేని కోసం ఉపయోగిస్తున్నాము, ఆహారం, నిద్ర, లైంగిక జీవితం, రక్షణ సమయంలో ఆత్మ దేవుడు అనుగ్రహించినవరాన్ని వాడే విషయం, డబ్బుపట్ల మన దృక్పథం...ఇలా మన జీవితంలోని ప్రతి రంగాన్ని దేవుడు రికార్డ్ చేస్తూనే ఉంటాడు. ఎందుకంటే సంఘం ఎత్తబడిన తర్వాత ప్రతి విశ్వాసి తన జీతం తీసుకోవడానికి క్రీస్తు న్యాయపీఠం ఎదుట నిలబడాలి. మనం జరిగించే క్రియలచొప్పున అవి మంచివైనా, చెడ్డవైనా దేహంతో జరిగించిన ప్రతి వాటి ఫలమును పొందదానికి మనమందరం క్రీస్తు న్యాయపీఠం ఎదుట ప్రత్యక్షం కావాలి. (2 కొరింథీ 5:10; కొలస్సీ 3:24,25; ఎఫెసీ 6:8; 1 కొరింథీ 3:14; ప్రకటన 22:12). కాబట్టి భయంకలిగి జీవిద్దాం, పవిత్రంగా, నమ్మకంగా పరిచర్యను చేద్దాం. పౌలు తన ప్రియశిష్యుడైన తిమోతికి చివరి ఉత్తరం రాస్తూ "మంచి పోరాటము పోరాడితిని... నా విశ్వాసము కాపాడుకొంటిని" అని ధైర్యంగా చెప్పగలిగాడు. మనం కూడా అదేవిధంగా చెప్పగలిగేటట్లు మన జీవితాన్ని ఎప్పటికప్పుడు దేవుని వాక్యపు వెలుగులో పరీక్షించుకొందాం.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 28, No.11 September 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

October: Pray for Nation
November: Spicon Messages
December: Why Jesus is so unique?
January 2023: God's Guidance
February: Discipleship

**Note:** Please send your writeups on or before
**10th of every month**



ఇది మన ఇంటి పని
దేవుని తోట పని
ఇన్వాల్వ్ కాని వారందరికీ
విడమర్చి చెప్పండి
ప్రభుని ఆత్మ కలిగినవారెవరూ
పనిలేకుండా కూర్చోరని!
ఈ లోకంలో పనిచేయనివారు
పరలోకంలో కూడా పనికిరారని!!

తాము చెయ్యకుండా
చేసేవాళ్ళను చెయ్యనివ్వకుండా
తేరగా పైకివెళ్ళి
ఊరేగుదామని అనుకునే వాళ్ళందరికీ
తెగేసి చెప్పండి
సిలువ మొయ్యనివాడు శిష్యుడు కాడని
పనిచెయ్యనివాడు పాత్రుడు కాడని!

– ప్రసాద్ తాళ్ళూరి

## లోపలి పేజీల్లో...

- జీవితాన్ని పరిచర్యను పరీక్షించుకొందాం - 2
- నిలిచి ఉండే పరిచర్య - 4
- పరిచర్యను సొంతం చేసుకున్నాను - 8
- స్వామికార్యమా స్వకార్యమా? - 11
- సిలువకు శత్రువులు - 14
- శరీర సంబంధి, ఆత్మసబంధి - 17
- సాకులు, స్వార్థంతో ప్రభువు పని ఆపొద్దు- 20
- దేవుని రాజ్యం- 23
- క్రైస్తవ తల్లుల అవసరత - 26
- పాపాన్ని విడిచిపెట్టవా? - 25
- క్రాస్ వర్డ్ పజిల్ - 30
- కోశాధికారి లేఖ - 31
- Making sense of the ministry - 32

కవర్ కథనం



# నిలిచి ఉండే పరిచర్య

ఒక ఉపాధ్యాయుడు సంవత్సరమంతా ఎంతో కష్టపడి బోధిస్తే, కేవలం ఇద్దరే పాసయ్యారట. యాజమాన్యం ఉపాధ్యాయుణ్ణి సంజాయిషీ అడిగితే నాదేంతప్పులేదు అంతా విద్యార్థులదే అన్నాడట. విద్యార్థులను అడిగితే ఉపాధ్యాయుని మీద చెప్పారట. దీంతో ఆ ఉపాధ్యాయుడు యాజమాన్య ఆగ్రహానికి గురవ్వాల్సి వచ్చింది.

మన పరిచర్యలో కూడా ఇలాంటి ఉదాహరణలే అనేకం చూస్తుంటాం. సంవత్సరమంతా కష్టపడి ఎంతో పరిచర్య చేస్తాం. కానీ చివరికి వచ్చేసరికి చాలా తక్కువమంది దేవునిలో నిలిచి ఉంటున్నారు, కొన్ని ప్రాంతాల్లో ఎవరూ మిగలని పరిస్థితుల ను చూస్తున్నాం. ఇది ఎంతో బాధాకరం. దీని గూర్చి ఆలోచించి, ఈ క్లిష్టమైన సమస్యను అధిగమించాలి. పరిచర్య ఎలా చేస్తే నిలుస్తుందో ఆలోచించి, ఆ ప్రకారం ముందుకు వెళ్ళాలి.

అపోస్తలుడైన పౌలు కొరింథీయులకు రాసిన మొదటి పత్రిక 3వ అధ్యాయంలో ఒక విశ్వాసి యొక్క పరిచర్య ఎలా ఉండాలో వివరిస్తూ ప్రతివాని పరిచర్య కూడా పరీక్షించబడుతుందని చెప్పాడు. యుఇయస్ఐని ఆరంభించిన దేవుడు భారతదేశంలోని కళాశాల విద్యార్థులను చేరుకొని, వారిని యేసుక్రీస్తు శిష్యులుగా తర్ఫీదు చేసి, సమాజానికి, సంఘానికి ఉపయోగపడే నాయకులుగా తీర్చిదిద్దాలనే దర్శనాన్ని మనకిచ్చాడు. గడిచిన సంవత్సరాలలో ఎంతోమంది విద్యార్థులు నాయకులుగా మారి సంఘానికి, సమాజానికి ఉపయోగపడుతూ ఉన్నారు. అయితే ఈ మధ్యకాలంలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు పరిచర్య పట్ల దృక్పథం మారడం వల్ల నిలిచి ఉండే పరిచర్యను చూడలేకపోతున్నాం. గనుక పరిచర్యను గూర్చిన ప్రాథమిక సూత్రాలు మరలా గుర్తు చేసుకొందాం.

పరిచర్యను గూర్చి అనేక నిర్వచనాలు ఉన్నాయి. వాటిల్లో ప్రాచుర్యం పొందిన ఒక నిర్వచనం చూద్దాం.

“పరిచర్య అంటే ప్రేమ కలిగిన వ్యక్తులు దేవుని వనరులను దేవుని మహిమ కొరకు మానవుల అవసరతలు తీర్చేలా చేయడం” అని వారెన్ వియర్స్‌బిగారు అంటారు.

ఈ నిర్వచనం ప్రకారం దేవుని పరిచర్యలో నాలుగు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. 1. పరిచర్య చేసే వారు దేవుని యొక్క వనరులను వ్యక్తిగతంగా ఎరిగి ఉండటం 2. మనుష్యుల అవసరాలను కరుణతో గుర్తించడం 3. దేవుని వనరులను వ్యక్తులకు చేర్చే సాధనాలుగా మారడం 4. దేవునిని మాత్రమే మహిమపరచడం.

దేవుని పరిచర్య గురించి సరైన అవగాహన కలిగి

ఉండడం ఎంతో అవసరం. ఇది తెలియకపోతే "సముద్రం మీద ప్రయాణం చేయడానికి దిక్సూచికి బదులు రోడ్ మ్యాప్ తీసుకొని బయలుదేరినట్లు ఉంటుంది".

నిలిచి ఉండే పరిచర్య గురించి ఆలోచించే ముందు ఫలభరితమైన పరిచర్య గురించి ఆలోచిద్దాం. మనం చేసే అనేక రకాల పనుల మూలంగా సహవాసానికి సభ్యులు చేర్చబడుతూ ఉండాలి. అంటే నాణ్యతలో, సంఖ్యాపరంగా విస్తరించాలి. కానీ చాలాచోట్ల అలాంటి పరిస్థితులు లేవు. ఒకప్పుడు ఎంతో బాగా పరిచర్య జరిగిన ప్రాంతాలు ఇప్పుడు ఎడారులుగా మారాయి. కొన్నిసార్లు కొంత మంది ఉన్నా వారిలో నాణ్యత మచ్చుకైనా కనిపించదు. అలాంటి స్థితికి గల కారణాలు విశ్లేషించుకొని ముందుకు సాగకపోతే పరిచర్య మనుగడకే ప్రమాదం.

## పరిచర్య ఫలభరితంగా లేకపోవడానికి గల కారణాలు

### 1. సరైన ఆత్మీయ జీవితం లేకపోవడం

దేవునితో అన్యోన్య సహవాసం, కన్నీటి ప్రార్థన, వాక్యధ్యానం, పరిశుద్ధ జీవితం లేకుండా అల వాటుగా, ఆచారంగా, అర్థరహితంగా పరిచర్య చేయడం వల్ల మన పరిచర్య ఫలభరితంగా ఉండట్లేదు. మరియ మార్తల విషయంలో కూడా ప్రభువువారు ఇదే సంగతి తెలియచేశారు. ప్రభువు దృష్టిలో ముఖ్యమైనది, మొదటిది ఆయనతో సన్నిహిత సహవాసం, నేర్చుకోవడం. మొదటి విషయాలకు చివరి ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తే మనం దేవుని పనిని దేవుని విధానంలో చేయనట్లే. పనిచేయడం ప్రాముఖ్యమే అయినా చాలాసార్లు పని చేయడానికి చూపించిన ఆసక్తి ఆత్మీయ జీవితానికి ఇవ్వము. కనుక ఈ రెండింటిని జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోవాలి. పరిచర్య చేస్తున్న నీ ఆత్మీయ జీవితం ఎలా ఉంది?

### 2. సభ్యులకు పరిచర్య పట్ల సరైన దర్శనం/ అవగాహన లేకపోవడం

కొంతమంది సభ్యులు ఎన్నో సంవత్సరాలుగా పరిచర్యలో ఉన్నా వారికి యుఇయస్ఐ పరిచర్య గూర్చిన ప్రాథమిక అంశాలు కూడా తెలియకపోవడం శోచనీయం. కొంతమంది ఇయు అంటే 'విద్యార్థులకు కొన్ని ఆత్మీయ కార్యక్రమాలు జరిపించేది' అని అనుకొంటారు. దేవుడిచ్చిన విజన్, మిషన్, లక్ష్యాలు, మౌళిక విలువలు, ప్రత్యేకతలు, సిద్ధాంతాలు ఇవన్నీ తెలియదు. ఒక విద్యార్థిని దేవునిలోకి నడిపించి, ప్రభువు శిష్యునిగా తర్ఫీదుచేసి సంఘానికి, సమాజానికి సేవచేసే బాధ్యతగల పౌరునిగా, నాయకునిగా తీర్చిదిద్దుతుందని చాలామందికి తెలియదు. అలాంటి వారు లెక్కకు ఎంతమంది ఉన్నా, ఫలితం శూన్యం. కనుక ప్రతివారు దేవుడిచ్చిన పరిచర్యను అర్థం చేసుకోవాలి, తమ దర్శనాన్ని పరి శీలించుకోవాలి. పాఠకుడా! నీ దర్శనం ఏంటో నీకు తెలుసా? విద్యార్థుల మధ్య పరిచర్య చేయడానికి నీకు స్పష్టమైన పిలుపు ఉందా? పరిశీలించుకోవాలి.

### 3. పరిచర్యలో ప్రతిఒక్కరి పాత్ర ముఖ్యమని గ్రహించకపోవడం

పరిచర్యలో కొంతమంది కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తూ ఉంటారు. కొంతమంది మేమే అంతా అన్నట్లుగా ప్రవర్తిస్తుంటారు. మరికొంతమంది ఇతరుల పనిని విమర్శిస్తూ లేదా పొగుడుతూ అదే వారి పని అన్నట్లు జీవిస్తూ ఉంటారు. ఈ విధానాలు సరైనవి కావు. దేవుని పనిలో ప్రతి ఒక్కరి పని ముఖ్యమే. అందుకే పౌలుగారు సంఘాన్ని శరీరంతో పోల్చారు. మన శరీరంలో అవసరం లేని అవయవం ఏదీ ఉండదుకదా!

### 4. సరైన ప్రాధాన్యతలు లేకపోవడం

ఒక విశ్వాసి ఈ లోకములో ఎంతో ప్రాముఖ్యమైన వాడని, అతడు దేవుని జతపనివాడని, దేవుని రాజ్యాన్ని నిర్మించడంలో అతని పాత్ర ఉంటుందని వాక్యం చెప్తుంది. అయితే చాలామంది విశ్వాసులు అన్నింటిలో వారే ఉంటూ, అన్నీ వారే చేస్తుంటారు. అలా జరిగినప్పుడు సమస్యలు వస్తాయి, ముఖ్యమైన వాటికి తగినంత సమయం ఇవ్వలేకపోవచ్చు. అందుకే మనకు సరైన ప్రాధాన్యతలు ఉండాలి. పరిచర్య మనకు ఒక ముఖ్యమైన విషయం కాకపోతే మనం దేవుని కొరకు ఏమీ చేయలేము. విశ్వాసీ నీ ప్రాధాన్యతలు నీకు తెలుసా?



### 5. గురితో/లక్ష్యంతో పనిచేయకపోవడం

మనం చేసే ప్రతిపనికి గురి ఉండాలి. అంతిమ లక్ష్యం దేవునిని సంతోషపెట్టడమే. కానీ చాలా సార్లు మనం కార్యక్రమాలు బాగా జరిగితే సంతోషపడి మిగిలిన విషయాలు నిర్లక్ష్యం చేస్తాం. పని ప్రారంభించినప్పుడే దాని గమ్యాన్ని కూడా చూడడం తెలివిగల వారి లక్షణం. ఏదో చేయాలి కాబట్టి చేశామనో, లేక ఎవరో ఏదో అనుకుంటారనో చేస్తే ఆ పని ఫలితాన్ని ఇవ్వదు. అప్పుడు మనకు తాలు గింజలే మిగులుతాయి.

### 6. దేవుని మీద ఆధారపడకపోవడం

దేవుని పనిని దేవుని పద్ధతిలో చేసినప్పుడే ఫలితం ఉంటుంది. అందుకే అపొస్తలుడైన పౌలు 1 కొరింథీ 2:5లో తాను జ్ఞానయుక్తమైన, తియ్యని మాటలు వినియోగింపక, పరిశుద్ధాత్మయు, దేవుని శక్తిని కనపరచే దృష్టాంతాలనే వాడానని చెప్పాడు. మనం కూడా చాలా సార్లు దేవుని మీద ఆధారపడకుండ మానవ పద్ధతుల మీద, మానవ శక్తి మీద ఆధారపడతాము. అలా చేయకూడదు. అందుకే వారెన్ వియర్స్‌బి గారు ఇలా చెబుతారు “పద్ధతులు చాలానే ఉంటాయి కానీ సూత్రాలు కొన్నే ఉంటాయి. పద్ధతులు మారతాయి కానీ సూత్రాలు కాదు”. కనుక పరిచర్యలో మనం ప్రాథమిక బైబిల్ సూత్రాలను ఎప్పుడూ మరవకూడదు.

### 7. సభ్యుల మధ్య సంబంధాలు సరిగా లేకపోవడం

మన సహవాసంలో ఎక్కువగా లోపిస్తున్న విషయం ఐక్యత. ఐక్యతను కాపాడుకోవడానికి అందరూ ప్రయాసపడాలని పౌలుగారు హెచ్చరిస్తున్నారు. మనం మాటల్లో చెప్పినంత సులభంగా చేతల్లో చూపించకపోవడం వేషధారణే. తగ్గించుకోవడం, ఎదుటివారిని మనకంటే యోగ్యులుగా ఎంచడం, ప్రేమించడం అనే విషయాలలో మనం ఎక్కడున్నాం? మనం ఉప్పొంగడానికి మనకు ఉన్న గొప్ప ఏంటి?

ఇలా ఇంకా ఎన్నో కారణాలు ఉన్నాయి. కనుక వ్యక్తిగతంగా ఈ అంశాలను ఆలోచించి సరిచేసుకుందాం.

పరిచర్య విస్తరిస్తున్నప్పుడు, సంఖ్యతో పాటు, సారం కూడా ప్రాముఖ్యమని వాక్యం చెప్తుంది. అందుకనే పౌలు గారు ఎఫెసీ 4వ అధ్యాయంలో చెప్పిన కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించడం ద్వారా మనం నిలిచి ఉండే పరిచర్యను నిర్మించవచ్చు.


## నిలిచే పరిచర్యకు పాటించాల్సిన సూత్రాలు

### 1. పరిచర్యకు మూలం దేవుడే

పరిచర్య దేవునిది. మనం కేవలం పరిచారకులం మాత్రమే. మనకు జీవితాంతం ఇదే భావన ఉండాలి. మనలో కొంతమంది పరిచర్య మాకు సంబంధించింది కాదని, మరికొంతమంది పరిచర్య అంతా నాదే అనుకొనే వారు ఉన్నారు. రెండూ మంచివి కాదు. మొదటిది మన ఇన్వాల్వ్‌మెంట్‌ని ప్రభావితం చేస్తే, రెండోది ఇతరులు పరిచర్యకు దూరమవ్వడానికి కారణం అవుతుంది. కాబట్టి జాగ్రత్తపడదాం.

### 2. సభ్యులు శరీరముగా ఉండాలి

భూలోకములోని క్రైస్తవ సంఘము క్రీస్తు శరీరమని, సంఘములోని సభ్యులు క్రీస్తు శరీరంలోని వేరు వేరు అవయవములై ఉన్నారని, శరీరానికి శిరస్సు క్రీస్తు అని, ఒక్క శరీరంలో మనకు అనేక అవయవములు ఉండినను, ఈ అవయవములన్నిటికి ఒక్కటే పని ఏలాగుఉండదో, అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరంగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేక అవయవములమై ఉన్నామని దేవుని వాక్యం తెలియజేస్తుంది (కొలస్సీ 1:18, రోమా 12:4,5). క్రీస్తు శరీరంలో కొన్ని అవయవాలు అనాసక్తిగా లేదా ప్రేక్షక పాత్రగా, మరికొన్ని అనైక్యతతో ఉంటే ఏకత్వం ఎలా? కుల, మత, ప్రాంతీయతత్వం, ధనిక, పేద ఇలా మరి ఎన్నో రకాలుగా చీలిపోతున్న, ప్రేక్షకపాత్ర వహించే సభ్యులు లోకాన్ని ప్రభావితం చేయగలరా? కనుక ప్రతి అవయవం మిగిలిన అవయవాలతో కలిసి పనిచేయాల్సిందే. వేరు పడే ఏ అవయవమైనా శరీరానికి గాయం చేస్తుంది. విశ్వాసులుగా మనం గాయాలను కట్టేవారిగా ఉండాలి.



### 3. ప్రతి ఒక్కరూ తమ తమ పరిమాణం చొప్పున పనిచేయాలి

దేవుని పొలములో అందరూ పని చేయాలి. పనులు వేరుగా ఉండొచ్చు. కానీ ఏదో ఒక పని

మాత్రం చెయ్యాల్సిందే. అందరూ అన్నీ చేయడం లేదా చేయాలనుకోవడం వాక్య విరుద్ధమే. గనుక దేవుడు మనకిచ్చిన సామర్థ్యం ప్రకారం దేవుని పొల ములో కష్టపడి పనిచేద్దాం.

### 4.ప్రేమచేత నడిపించబడి అభివృద్ధి పథంలో నడవాలి

మనం చేసే ప్రతి పనికి దేవుని ప్రేమే ఆధారంగా ఉండాలి. అప్పుడే నిలిచి ఉండే పరిచర్య చేయగలం. అసూయ, ద్వేషం, కోపం, ఇతరులతో పోటీ లాంటి విషయాలు పరిచర్యకు గొడ్డలి పెట్టు. కనుక మనల్ని పరిచర్యకు పురికొల్పేది, నడిపించేది దేవుని ప్రేమే అయి ఉండాలి. విశ్వాసీ నిన్ను ఏది నడిపిస్తుంది?

## పరచర్య నిలిచి ఉండడానికి పాటించాల్సిన హెచ్చరికలు (1 కొరింథీ 3వ అధ్యాయం)

### 1. సరైన పునాది మీద నిర్మించాలి

క్రీస్తు మాత్రమే ఒక విశ్వాసి జీవితానికి, పరిచర్యకు పునాదిగా ఉండాలి. లేకపోతే ఆ జీవితం, పరిచర్య ఎప్పుడు ఎలా కూలుతుందో చెప్పలేం. క్రొత్తగా జన్మించిన వారి పునాది దేనిమీద ఉందో గమనించి అది క్రీస్తు మీద ఉండేటట్లు చూడడం మన పని. కొంతమంది అశీర్వాదాల మీద, ఆరోగ్యం మీద విశ్వాస జీవితాలు నిర్మించుకొంటారు కాబట్టి జాగ్రత్తగా క్రీస్తనే పునాదిమీద నిర్మించాలి.

### 2. సరైన పదార్థాలతో నిర్మించాలి

పౌలుగారు రెండు భిన్నమైన పదార్థాల గురించి చెప్పాడు. ఒక రకం స్థిరమైనవి, విలువైనవి, అరుదుగా దొరికేవి. రెండో రకం కాలిపోయేవి, చౌకైనవి, సులభంగా దొరికేవి. పరిచర్యలో మనం ఎలాంటి విలువలు నేర్చుకొంటూ, నేర్పిస్తున్నాము అనేది చాలా ముఖ్యం. నిలిచి ఉండే పరిచర్య ఖచ్చితంగా విలువైన వాటితోనే కట్టాలి.

### 3. సరైన ప్రణాళికతో చేయాలి

ప్రణాళిక లేని పరిచర్య అర్థరహితంగా ఉంటుంది. ఇయు పరిచర్యలో ప్రణాళికలకు కొదువే లేదు. అయితే అవన్నీ సామూహికంగా మనం వేసుకొనే ప్రణాళికలే. వాటితోపాటే, వ్యక్తిగతంగా కూడా ప్రతివారికీ పరిచర్య గూర్చిన ప్రణాళిక అవసరం. అప్పుడే మనం అర్థవంతంగా పని చేస్తాము. సంవత్సరం చివరలో మన ద్వారా బలపరచబడి, స్థిరపరచబడిన వారు ఎవరూ లేకపోతే మనం ఏం చేసినట్లు? చేస్తున్నట్లు?

### 4. సరైన ఉద్దేశాలతో చేయాలి

మనం ఏమి చేసినా సరైన ఉద్దేశంతో చేయాలి. వ్యక్తిగత లాభం కోసమో, లేక ఇతరుల మెప్పు కోసమో, లేదా అందరికీ కనపడాలనే తపనతోనో చేసే పని దేవునిని మహిమ పరచదు. కనుక అలాంటి ఉద్దేశాలు ఏమైనా ఉంటే మనం మార్చుకొందాం.

## ముగింపు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో విద్యార్థి పరిచర్యకు ఎన్నో సవాళ్ళు ఎదురవుతున్నాయి? చీకటి శక్తులు ప్రతి కుటుంబాన్ని, ప్రతి వీధిని, గ్రామాల ను, పట్టణాలను ఏలుతున్నాయి. మూఢనమ్మకాలు, దురాచారాలు, తిరునాళ్ళు మొదలైనవి ప్రజలను ఎంతో ప్రభావితం చేస్తూ, వారిని ఆత్మీయంగా గుడ్డివారినిగా చేస్తున్నాయి. ఫలితంగా, ప్రజలు సువార్త వెలుగును గ్రహించలేకపోతున్నారు.

భవిష్యత్ జీవితం పట్ల శ్రద్ధలేకపోవడం, నిర్లక్ష్య జీవిత విధానం, ఆత్మహత్యా ధోరణి, నిరాశ, ఆర్థిక సమస్యలు, తాగుడు, పార్టీలు, పబ్‌లవెంట తిరగడం, పెళ్ళికి ముందే లైంగిక అనుభవం కోసం ఆరాటపడడం, వివాహేతర సంబంధాలు, అనారోగ్యం, తిరుగుబాటు స్వభావం, శాస్త్రీయ పరిజ్ఞానానికి, మొబైల్స్‌కు, డ్రగ్స్‌కు బానిసల వ్వడం మొదలగునవి మన విద్యార్థుల్లో కనిపిస్తున్న ధోరణులు.

ఈ సవాళ్ళను, ధోరణులను సమర్థవంతగా ఎదుర్కొని పనిచేయాలంటే మనకు దేవుని శక్తి అవసరం, ఇలాంటి వారు దేవునిలో నిలిచి దేవునికొరకు పనిచేయాలంటే కన్నీటి ప్రార్థన ఎంతో అవసరం. వెల చెల్లించని పరిచర్య ఎలాంటి ఫలితాన్ని చూపించదు. గనుక యధార్థంగా, పవిత్ర జీవితంతో, దేవునిమీద ఆధారపడుతూ, త్యాగపూరితంగా కష్టపడి పని చేసినప్పుడే దేవుడు మెచ్చే, పరీక్షకు నిలిచే, కాలిపోని, నిలిచి ఉండే పరిచర్యను చూస్తాం. దేవుని నుంచి బహుమానాన్ని పొందుకొంటాం. దేవుడు ప్రత్యక్షమైనప్పుడు భళా నమ్మకమైన మంచి దాసుడా అని మెప్పు పొందే గుంపులో ఉంటాం. అలా ఉండేటట్లు దేవుడు మనందరికీ సహాయం చేయును గాక. ఆమెన్.

**– కె. రాజశేఖర్,** బాపట్ల

అనుభవం

# పరిచర్యను సొంతం చేసుకున్నాను

2021 జనవరి. అది బదిలీల సమయం. 20% హెచ్ఆర్ఎ, సౌకర్యం కలిగిన ఇల్లు, స్కూల్‌కి ఇంటికి రెండు కిలోమీటర్ల దూరం, రిటైరయ్యేవరకు అక్కడే ఉద్యోగం చేయడానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. కానీ దేవుడు నన్ను పిలిచిన పిలుపు–ఔట్‌రీచ్ పరిచర్య గుర్తుకు వస్తుంది. దేవుని కోసం ఏదైనా చేయాలనే తపన దినదినం అధికమవుతూ ఉంది. ఇక ఆలస్యం చేయకుండా, మా సుఖవలయాన్ని విడిచి విద్యార్థుల మధ్య పరిచర్య లేని ప్రాంతానికి వెళ్ళాలని ప్రార్థనాపూర్వకంగా నిర్ణయించుకున్నాము. ఫ్లోరిన్ ఎక్కువ, హెచ్ఆర్ఎ తక్కువ, అద్దెకు ఇల్లు అంతగా దొరకని, ఉద్యోగస్థులు వెళ్ళడానికి భయపడే గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకొని వెళ్ళాము. మీరు అడుగుపెట్టు ప్రతి స్థలాన్ని మీకిచ్చుచున్నాను (యెహోషువ 1:3) అనే వాగ్దానం ప్రకారం గతంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడ ఇయు పరిచర్య ప్రారంభించడానికి బలహీనులమైన మాకు కృప చూపుతూ వచ్చాడు. ఇప్పుడు కూడా అదే వాగ్దానాన్ని దేవుడు మా జీవితంలో నెరవేర్చాడు. అక్కడికి వెళ్ళిన నెల న్నరలోపే ఇజియఫ్, ఇబియస్ ప్రారంభించడానికి, ఒక సంవత్సరంలోపే ఆ ప్రాంతంనుండి ఇయర్ ప్లాన్ చేయడానికి దేవుడు కృప చూపెట్టాడు. దేవునికే మహిమ కలుగునుగాక!

తమ జీవితంలో దేవుని ప్రణాళికను అర్థం చేసుకొని, దాని ప్రకారం జీవించే ప్రతి ఒక్కరినీ దేవుడు ఒక్కొక్క ఏరియాలో ఒక్కొక్క విధానంలో వాడుకొంటాడు. ప్రతి ఒక్కరిపట్ల దేవుని ప్రత్యేకమైన ప్రణాళిక ఉంటుంది. అందరూ ఒకే ఫార్ములాను ఫాలో అవ్వాల్సిన అవసరం లేదు. దేవునిమీద ఆధారపడినప్పుడు పరిచర్య లేని ప్రాంతాల్లో ఎలా పరిచర్య చేయాలో తన నడిపింపును, ఫలింపునూ ఇస్తాడు. అయితే దానికి మన వ్యక్తిగత జీవితంలో ఈ క్రింది విషయాలు ఎంతో ప్రాముఖ్యం.

### 1. పరిశుద్ధత

దేవునికి పరిచర్య కంటే పరిచారకుని జీవితం ముఖ్యం. మోషే దేవునితో గడపడం ద్వారా దేవుని స్వారూప్యంలోకి మార్చబడుతూ దేవుని ఉద్దేశాలను నెరవేర్చాడు (సంఖ్యా 12:8). పరిశుద్ధత లేని పరిచర్య ఫలించదు. ఒకవేళ పరిచర్య జరిగినట్లు అనిపించినా ఫలితం నిలవదు.

పరిశుద్ధ జీవితాన్ని గూర్చి మాట్లాడుతూ జేసి రైల్ ఇలా అంటాడు "లేఖనాల్లో తెలియజేయబడిన దేవుని మనస్సుకు అనుగుణంగా జీవించడం, ఆయన ద్వేషించినదాన్ని ద్వేషించడం, ఆయన



ఒకసారి నేను స్పీకర్‌ని రిసీవ్ చేసుకోవడానికి 40 నిమిషాలు పర్మిషన్ అడిగి వెళ్లాను. కాని ఆ స్పీకర్ ఆ రోజు బాగా ఆలస్యంగా వచ్చారు. ఆ సమయంలో దేవుడు నాతో 'ఉద్యోగం చేసే సమయాన్ని మినిస్ట్రీ కోసం కేటాయించవద్దని' మాట్లాడాడు.



ప్రేమించిన దాన్ని ప్రేమించడం, ఈ లోకంలో ఉన్న ప్రతి దానిని దేవుని వాక్యంతో తప్పా, ఒప్పా అన్న విషయాన్ని పరీక్షించడమే పరిశుద్ధత అని, దేవునికి ఎక్కువగా లోబడి ఆయన ఇష్టపడిన విషయాలను ఇష్టపడినవారే అత్యంత పరిశుద్ధులు అని అంటాడు. అలాగే ఒక పరిశుద్ధుడు తనకు తెలిసిన పాపాన్ని వదిలిపెట్టడానికి, తనకు తెలిసిన ఆజ్ఞలన్నిటికీ ఇష్టపూర్వకంగా లోబడడానికి, దేవునికోసం ఒక స్థిరనిర్ణయం తీసుకొని, ఆయన చిత్తానికి లోబడాలనే హృదయపూర్వక వాంఛను కలిగి, లోకాన్ని సంతోషపెట్టాలని గాక, దేవునికి మాత్రమే సంతోషపెట్టాలనే కోరిక కలిగి ఆయన మార్గాలన్నిటినీ ప్రేమిస్తాడని చెబుతాడు".

నేనుకూడా ఇతరులతో దురుసుగా ప్రవర్తించినప్పుడు, ఇతరుల లోపాలను గూర్చి, బలహీనతలను గూర్చి మాట్లాడినప్పుడు దేవుడు నన్ను గద్దించి సరిచేసిన సందర్భాలు చాలా ఉన్నాయి.

నేడు దేవునితో సమయం గడపడం కన్నా మొబైల్‌తో సమయాన్ని గడుపుతున్నారు. దేవుడు, దేవుని వాక్యం కన్నా మనుషులకు, లోక పద్ధతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. మౌనధ్యాన సమయం, బైబిల్ స్టడీకి, మెసేజ్‌కి సిద్ధపడే సమయం మినహా దేవునితో సన్నిహితంగా గడపలేని నిరాసక్తత మనలను ఆవరిస్తూ ఉంది. ఫలితంగా పరిశుద్ధతలో ఎదగాల్సినంతగా ఎదగలేక, దేవుని ఉద్దేశాలు తెలుసుకోలేకపోతున్నాం. అందువల్లే పరిచర్య లేని ప్రాంతాలు ఇంకా ఉంటున్నాయి. మోషే, పౌలు లాంటి భక్తులు దేవుని సన్నిధిలో ఎక్కువగా గడిపి దేవుని స్వరూపంలోకి మార్చబడుతూ దేవుని ఉద్దేశాలను నెరవేర్చారని మర్చిపోకూడదు.

## 2. పని

దానియేలు తను చేసేపనిలో నమ్మకంగా ఉండటం ద్వారా దేవునిని మహిమపరిచాడు (దానియేలు 6:4) విద్యార్థివైతే చదువును దేవుడు మనకప్పగించిన పనిగా భావించాలి. అందులోనే దేవున్ని మహిమపరచాలి. గ్రాడ్యుయేట్స్‌వైతే దేవుడు మనకిచ్చిన ఉద్యోగంలో నమ్మకంగా పనిచేయాలి. సమయానికి వెళ్ళకపోవడం, వర్కింగ్ అవర్స్‌లో పిచ్చాపాటి కబుర్లు, మినిస్ట్రీకి సంబంధించిన పనులు, ఫోన్ చేయడం ఇవన్నీ దేవునికి అయిష్టమైనవిగా భావించాలి. ఒకసారి నేను స్పీకర్‌ని రిసీవ్ చేసుకోవడానికి 40 నిమిషాలు పర్మిషన్ అడిగి వెళ్ళాను. కాని ఆ స్పీకర్ ఆ రోజు బాగా ఆలస్యంగా వచ్చారు.ఆ సమయంలో దేవుడు నాతో 'ఉద్యోగం చేసే సమయాన్ని మినిస్ట్రీ కోసం కేటాయించవద్దని' మాట్లాడాడు. అలాగే పంక్చువాలిటీ విషయంలో నేను దేవునికి ప్రార్థన చేస్తుండగా తన నమ్మకత్వాన్ని నా యెడల చూపిస్తున్నాడు.

## 3. పరిచర్య

పరిచర్య చేయడం అనేది ఆప్షన్ కాదు ఆబ్లిగేషన్. రక్షింపబడిన ప్రతి విశ్వాసి ప్రభువు పనిచేసి తీరాలి. అది ఎక్కడ చేయాలి? ఎలా చేయాలన్నది ప్రభువు దగ్గర కూర్చొని నేర్చుకోవాలి. క్రీస్తు యొక్క సిలువ వ్యర్థం కాకూడదన్నది (1 కొరింథీ 1:17) పౌలు గారి ఇంటెన్షన్. ఇతరులు చేస్తున్నారా లేదా అనేది మనకు అనవసరం. ఎవరు చేసినా చేయకపోయినా దేవుడు మనకు అప్పగించిన పని కోసం ఎంత రిస్క్ అయినా తీసుకోవాలి. లోకల్ పరిచర్య ఆగిపోయే సందర్భాలొచ్చినప్పుడు, ఇనిషియేట్ చేసే వ్యక్తులు తక్కువైనప్పుడు కొన్నిసార్లు వారానికి 5 బైబిల్ స్టడీస్ తీసుకోవడానికి కూడా దేవుడు కృప అనుగ్రహించాడు. ఔట్‌రీచ్ పరిచర్య చేయడానికి ఎవరూ ఆసక్తి చూపించనప్పుడు మనమే రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడాలి.

ఒక ప్రాంతానికి నేను ఔట్‌రీచ్ ఇన్‌ఛార్జిగా ఉంటూ 9 సంవత్సరాలు ఓపికతో వెళ్ళడం, ప్రార్థించడం, గ్రౌండ్‌వర్క్ చేయడం జరిగింది. చివర్లో దేవుడు మంచి ఫలితాల్ని ఇచ్చాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఔట్‌రీచ్ ఇన్‌ఛార్జిగా ఉంటూ 40 ప్రాంతాలను/మండలాలను మూడు లేక నాలుగు సార్లు అక్కడికి వెళ్ళి ప్రార్థిం

చడానికి దేవుడు కృప చూపాడు. ప్రార్థించడం, ప్రయాసపడడం మన వంతు. ఫలితాన్నివ్వడం దేవుని వంతు. కష్టపడిన తర్వాత రిజల్ట్ రాకపోయినా, నిరాశపడకూడదు. రక్షణ పొందినా దేవునిలో స్థిరపడని ఒక తమ్ముని కోసం విడువక ప్రార్థిస్తుండగా 10 సంవత్సరాల తర్వాత అతను స్థిరపడి ఒక సంఘంలో పాస్టర్‌గా కొనసాగడానికి ప్రభువు కృప చూపాడు. మొదటినుండి మా ప్రాంతంలోని విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పేర్లను ఒక డైరీలో రాసుకొని ప్రార్థించడం దేవుడు నాకు అలవాటు చేశాడు. కొత్తగా పరిచర్య ప్రారంభమైన మా ప్రాంతం నుండి ఒక తమ్ముడు నేషనల్ స్టాఫ్‌గా వెళ్ళడానికి ప్రభువు కృప చూపాడు. దేవుడు నమ్మదగినవాడు. 1 కొరింథీ 15:58 ప్రకారం మన ప్రయాస వ్యర్థం కానివ్వడు. కాబట్టి విలువలేని మన జీవితాలను ప్రభువు సన్నిధిలో పెట్టి ఆయన ద్వారా పరిచర్యలో మంచి ఫలాలు పొందుదాం.

## కొత్త ప్రాంతాలలో పరిచర్య ప్రారంభించాలంటే...

ఆ ప్రాంతానికి వెళ్ళి బాగా ప్రార్థించాలి. అక్కడ పనిచేసే సాతాను శక్తులు బంధింపబడాలని, సాతాను కోటలు కూలద్రోయమని భారంగా ప్రార్థించాలి. అక్కడున్న కాలేజ్‌లు, కాలేజ్ స్టూడెంట్స్‌ను లిస్ట్ చేసుకోవాలి. అక్కడ విశ్వాసులుగా ఉండి పరిచర్య చేయాలనే భారం కల్గిన గ్రాడ్యుయేట్స్, ప్రభువును ఎరిగిన విద్యార్థులు ఎవరైనా ఉన్నారేమో గుర్తించాలి. వారికి యుఇయస్ఐని పరిచయం చేయాలి. వీరిని ఫాలోఅప్ చేస్తూ, అవిశ్వాస విద్యార్థులతో పరిచయాలు పెంచుకొని వారికి వ్యక్తిగత సువార్త,సాక్ష్యం చెప్పాలి. ఆ తర్వాత ఇబియస్ ప్రారంభించాలి. దేవుడు తన ప్రణాళికలో ఆ ప్రాంతంలో ఇయు, ఇజియఫ్‌ని ప్రారంభిస్తాడని నమ్మి ఆ ప్రాంతం పేరున యుఇయస్ఐ, యుఇయస్ఐ–ఏపి పేరున కాంట్రిబ్యూషన్ పంపించాలి. నేను ఇలా చేస్తాను. మనకు పరిచయమైన విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్‌కి విజన్, మిషన్ గురించి వివరించి ఆసక్తిగల వారిని ఆధారం చేసుకొని ఇయర్‌ప్లాన్ చేయాలి. వారి ద్వారా మిగిలిన వారితో పరిచయాలు పెంచుకొని గాస్పల్ మీటింగ్స్, రిట్రీట్స్‌కి ఆహ్వానించాలి. మన పరిచర్యకి కటింగ్ ఎడ్జ్ అయిన వ్యక్తిగత సువార్త, కొత్త ప్రాంతాలలో బాగా సఫలీకృతం అవుతుంది. సంఘ సభ్యులతో మంచి సంబంధాలు కల్గివుండాలి. ఆతిథ్యం కూడా చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది.

పని దేవునిది, ప్రజలు తనవారు. మనం ప్రభువుకి సమర్పించుకొని అందుబాటులో ఉంటే చాలు. బలహీనులమైన మనలను దేవుడు ఉపయోగించుకొంటాడు. నాలో చాలా బలహీనతలున్నాయి, వాక్చాతుర్యం లేదు, నేను ఈ పరిచర్యకు పనికిరానని మొదట్లో చాలాసార్లు భావించాను. కానీ దేవుడు నన్ను వదలలేదు. వాక్యం ద్వారా బలపరిచి 'ఈ పరిచర్యను సొంతం చేసుకోమని, ఈ పరిచర్యను విడిచిపెట్టకుండా కొనసాగమని' ఎంతో స్పష్టంగా చెప్పాడు. ఆ పిలుపు ప్రకారం దేవుని కృపతో ముందుకు సాగుతున్నాను.

## సువార్తకు తమ జీవితాలను అంకితం చేసుకొన్నవారు

సువార్త విలువనెరిగిన అనేకమంది గొప్ప భక్తులు దేశవ్యాప్తంగా సువార్తను మ్రోగించారు. సువార్తకే తమ జీవితాలను అంకితం చేసుకొని జీవించారు. సువార్త కొరకే అంకితమైన వారిలో కొందరు...

**భక్త సింగ్** – క్రైస్తవుడైనందుకు భార్య, బంధువులు తిరస్కరించి దూరమైనా, క్రీస్తు కొరకు, సువార్త విస్తరణ కొరకు, చివరి శ్వాసవరకు పోరాడారు.

**ప్రొ॥ ఇనాక్** – స్వంత బిడ్డలు లేకపోయినా, సువార్త ద్వారా కనిన బిడ్డలే తమ బిడ్డలుగా భావించి సాగిపోయారు.

**డా॥ స్టైరెట్** – తమ బిడ్డలను అమెరికాలోనే వదలి, భారత దేశమంతా సువార్త గురుతులు మిగిల్చి పోయారు.

**పి.సి.వర్గీస్** – భారత దేశ విద్యార్థులను నా ప్రభువుకొరకు గెలుచుకొంటానని భారమైనా, దూరమైనా సువార్తకై దూసుకెళ్ళారు.

**సత్యకీర్తిరావు** – సువార్త, సత్ప్రవర్తనకు పెద్ద పీట వేసి దక్షిణ భారతదేశాన్ని సువార్తతో దున్ని తన పరుగును మహిమకరంగా ముగించారు.

**జోసఫ్ అభిషేకరావు** – అల్సర్‌తో బాధ పడుతున్నా అలుపెరుగక ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కొరకు కన్నీటితో ప్రార్థించి, ప్రాణమిచ్చారు.

– **కొండలరావు,** బొల్లాపల్లి



# స్వామికార్యమా? స్వకార్యమా?

## ఉపోద్ఘాతం

ప్రభువు చెప్పిన మంచి సమరయుని ఉపమానంలో మూడు న్యాయాలు కనబడుతున్నాయి (లూకా 10). 1. అడవి న్యాయం. ఇది 'నీదంతా నాదే' అంటుంది. 2. స్వార్థ న్యాయం. ఇది "నాదంతా నాదే" అంటుంది. 3. ప్రేమ న్యాయం. ఇది "నాదంతా నీదే" అని అంటుంది. విశ్వాసులలో ఎక్కువమంది ఈ రెండవ న్యాయంతో జీవిస్తూ ఉంటారు. వీరు యాజకులు, లేవీయులే కాని ప్రక్కదారి. మనం ఏ న్యాయంలో బ్రతుకుచున్నాం? మనమందరమూ మూడవ న్యాయంలో జీవించాలని ప్రభువు కోరుతున్నాడు. ఒక గృహ ప్రతిష్ఠలో నేను మాట్లాడుతూ, యేసుప్రభువు ఏ ఇంటిలో ఉంటే ఆ ఇంటి కప్పు ఊడిపోతుంది (లూకా 5:18,19) అని చెప్పాను. అందరూ ఆనందించారు. కానీ ఒక సహోదరి లేచి సాక్ష్యం చెబుతూ, 'నేను ప్రభువు కొరకు ఏమీ నష్టపోలేదని' చెప్పింది. "తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అనేది లోక సామెత. 'నిన్ను నీవు ప్రేమించుకో' అనేది నేటి కాల వేదాంతం. 'నాదంతా నీదే' అనేది ప్రభువు మనస్సు.

## క్రీస్తు మనస్సు (ఫిలిప్పీ 2:1-5)

మనందరము ప్రభువులోను, పరిశుద్ధాత్మ సహవాసములోను ఏకమైయున్నాము. అనగా ప్రభువు లక్షణాలు ప్రేమ, ఆదరణ, ఆత్మకార్యాలు దయ, వాత్సల్యాలు మన సహవాసములో కనపడాలి. ఏకమనస్సు, ఐక్యతలోని మేలు (కీర్తన 133) ఎంతో మనోహరము. అచ్చట ఆశీర్వాదము శాశ్వత జీవముంటుంది. మన మనస్సులోని విరోధ భావాలు అ) కక్ష (క్షమించలేకపోవడం) ఆ) వ్యర్థమైన గర్వము (స్వనీతి గర్వము) నుండి విడిపించబడాలి. అందుకనే మీరు మనసు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి (రోమా 12:2) అని దేవుని వాక్యం హెచ్చరిస్తుంది.

ఒకరినొకరు అనునది సహవాస సూత్రము. ఒకరినొకరు ప్రేమించుడి, క్షమించుడి, దయగలిగి యుండుడి, మనస్సు కలిసియుండుడి, తీర్పు తీర్చకుడి, అంగీకరించుడి, పవిత్రమైన ముద్దు పెట్టుకొనుడి మొ॥నవి. "కలిసి జీవించెదం, కలిసి పనిచేసెదం, కలిసి ప్రార్థించెదం మా దేవా" పాటవలె. ఫిలిప్పీ 2:1-5 వచనాల సారాంశమే క్రీస్తు మనస్సు.

## క్రీస్తు మాదిరి (ఫిలిప్పీ 2:6-8)

ఇతరుల నిమిత్తము సరిగా ఎంచుకొనుట (రైట్ రెకనింగ్). ఆయన దేవుడైయుండి తండ్రితో ఉండే భాగ్యాన్ని మన నిమిత్తం విడిచిపెట్టాలని ఎంచుకున్నాడు. మనము కూడ అధికముగా ఎంచుకొనక అనుగ్రహింపబడిన విశ్వాస పరిమాణము చొప్పున ఎంచుకోవాలి (రోమా 12:3). క్రీస్తు మన నిమిత్తము రిక్తుడై, సమస్తము కోల్పోవడానికి ఇష్టపడ్డాడు. గనుక మన స్వంత అవసరాలు

ఇతరుల నిమిత్తము త్యాగము చేయాలి. సమస్తము కాకపోయినా కొంతైనా. అలాగే క్రీస్తు మానవరూపం ధరించి మరణము పొందునంతగా విధేయత, వినయము చూపించాడు.

ఈ లక్షణాలు మనలో లేవు. ప్రతిరోజు ప్రభువు ముఖము చూస్తూ ఉంటే అనగా ఆయన మాటలు ధ్యానిస్తూ, ఆయనతో మాట్లాడుతూ ఉంటే ఈ లక్షణాలు మనకు వస్తాయి. ఈ మనస్సు మనకు వస్తుంది (2 కొరింథీ 3:18). ప్రభువు నిన్ను తగిన సమయమందు హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన హస్తము క్రింద దీనమనస్కులైయుండుడి (1 పేతురు 5:6). ఆయన దీనులను హెచ్చిస్తాడు. ఆయన అడుగుజాడలలో మనము నడుచుకొనునట్లు మనకు మాదిరి ఉంచిపోయెను (1 పేతురు 2:21).

## పౌలు మనస్సు (ఫిలిప్పీ 2:17,18)

పౌలు ఫిలిప్పీయులను ప్రేమించి వారి విశ్వాస యాగములోను, పరిచర్యలోను పానార్పణముగా పోయబడడానికి సంతోషముతో ఇష్టపడ్డాడు. పానార్పణము అంటే ఏంటి? నీటిని అర్పణముగా భూమి మీద పోయడం. అర్పించిన ఆ నీరు మరలా రాదు. అలాగే అర్పించిన ఆ జీవితం నష్టపోయిన జీవితమే. మన జీవితాన్ని దేవునికి పానార్పణముగా అర్పించి దేవుని ఘనపరచాలి. 2 సమూ 23:15,16లో దావీదు సేవకులలో ముగ్గురు ఫిలిష్తీయులతో పోరాడి బెత్లేహేము బావి నీళ్ళు దావీదు వద్దకు తెచ్చారు. దావీదు ఆ నీరు తాగనొల్లక భూమి మీద పారబోశాడు (పానార్పణముగ). సేవకులు చూపిన సేవా సమర్పణ దేవునికే చెందాలని ఆలాగు చేసి దావీదు దేవుని ఘనపరచెను. మరియ ప్రభువు పాదాల మీద పోసిన అత్తరును చూసి శిష్యులు ఈ నష్టమెందుకు అని అన్నారు. ప్రభువు కొరకు సమర్పించిన జీవితం ఎప్పుడూ నష్టము కాదు (యోహాను 12). కానీ ఇక్కడ పౌలు గారు దేవుని సేవలో గాక ఫిలిప్పీయుల సేవలో పానార్పణంగా పోయబడడానికి సంతోషిస్తున్నాడు. వారి సేవలో తన జీవితాన్ని నష్టపరచుకొనడానికి సంతోషంగా ఇష్టపడుచున్నాడు. ఇది గొప్ప ప్రేమ మాదిరి. వారిని కూడ సంతోషించమని రాస్తున్నాడు. ఇలాంటి పరస్పర ప్రేమలు మన సహవాసాలలో ఉంటే ఎంతో అద్భుతముగా ఉంటుంది. ఇది మానవ సేవయే మాధవ సేవ లాంటిది కాదు. క్రీస్తు ప్రభువు నేర్పిన క్రొత్త ఆజ్ఞ ప్రకారము జీవించుట (యోహా 13:14; 15:12). తాను చూపిన ప్రేమ, మాదిరిని మనకు ప్రమాణముగా పెట్టాడు. మన జీవితాలు కూడా ఇతరుల సేవలో పానార్పణముగా పోయబడుచున్నాయా? ఇది చాలా కష్టము, మనకసాధ్యము. ప్రభువు మనలో ఉండి బలపరిస్తేనే గాని ఇది సాధ్యము కాదు. ఈ పరిమళం ప్రధాన యాజకుని తలమీదనుండి అంగీ అంచుల వరకు దిగజారాలి. హెర్మోను మంచు సీయోను కొండల మీదికి దిగివచ్చునట్లు ఉండాలి (కీర్తన 133). మనము ప్రభువును ప్రేమిస్తాము కాని యితరులను ప్రేమించలేము. తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకునియందు నిత్యజీవముండదు. తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటే ఎక్కువైన ప్రేమ గల వాడెవడును లేడు (యోహా 15:13).

## తిమోతి మనస్సు (ఫిలిప్పీ 2:19-23)

తిమోతి సంఘము యొక్కయు సహోదరుల యొక్క క్షేమము తెలియజేసేవాడు. సహవాసములోని విశ్వాసులు ఒకరి క్షేమము ఒకరు తెలిసికొని తెలియజేయాలి. ఒక ప్రాంతంలో ఒకే సహవాసానికి చెందిన విశ్వాసులు ఒక్కసారైనా పలకరించుకోనివారు లండన్‌లో కలిసికొని హలో అని వాటేసుకున్నారంట. ఎంత ఆశ్చర్యము! సహవాసము అంటే అర్థం ఇదేనా? తిమోతి సంఘ క్షేమాన్ని తెలియజేసేవాడు మాత్రమే కాదు గాని సంఘ క్షేమాభివృద్ధి గూర్చి వారి అక్కరల కోసం చింతించాడు. ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి. ఒకరి ప్రార్థనావసరతలు మరియొకరు తెలిసికొని పరస్పరము ప్రార్థించాలి. అక్కరలో ఉన్నవారిని ఆదుకోవాలి. తిమోతి ప్రభువు పనికై తన సొంత పనులు మానుకొంటాడు. మనమైతే మన సొంత పనులకై ప్రభువు పని మానివేస్తాము. “నాది నాదే అంటాము”. విద్యార్థిగా, గ్రాడ్యుయేట్‌గా నీవు చేయవలసిన పనేంటో నీకు తెలుసా?

## తిమోతి

తిమోతి యోగ్యుడు. దేవుని యెదుట యోగ్యునిగా తన్నుతాను దేవునికి కనపరచుకోవడానికి జాగ్రత్తపడినవాడు. ఫిలిప్పీ సంఘములో కూడ యోగ్యుడని సాక్ష్యము పొందాడు. సువార్త

వ్యాపించుటకు సేవ చేశాడు. నీ ద్వారా సువార్త వ్యాపిస్తున్నదా? వ్యాపించడానికి నీవేమి చేయుచున్నావు? తిమోతి పౌలు గారి ఆత్మీయ బిడ్డ. పౌలుగారి కుమారునివలె సేవ చేశాడు. సువార్త పరిచర్యలో పౌలుగారితో ప్రయాసపడ్డాడు. నీవెప్పుడైనా దేవుని సేవకులను ప్రేమించి వారికి సేవ చేశావా? వారితో కలిసి సువార్త ప్రకటించావా? పౌలుగారు తిమోతిని ఫిలిప్పీయులయొద్దకు పంప ఉద్దేశించాడు ఎందుకంటే తిమోతి వారిని ఆదరిస్తాడు, బలపరుస్తాడు.

## ఎపఫ్రొదితు మనస్సు (ఫిలిప్పీ 2:25-30)

ఎపఫ్రొదితు జీవిత సాక్ష్యము సహవాసములో మన వ్యక్తిగత సంబంధాలను తెలియజేస్తుంది. క్రీస్తు యేసునందలి మన స్థానాన్ని కూడ తెలియజేస్తుంది. మొదటిగా మనము సహోదరులము. బోధకులము కాదు. గురువులం కాము. ఒకే రక్తముచే విమోచింపబడ్డాము. ఒక్క ఆత్మయందే పానము చేసేవారము. ఒకే అక్షయ బీజము నుండి పుట్టినవారము. మనము జతపనివారము. అనగా కలిసి పనిచేసేవారం. ఒకే లక్ష్యముతో, గురితో పనిచేసేవారం. మనందరము క్రీస్తుతో కూడ జతపనివారము. పౌలు ఎపఫ్రొదితుతో కలిసి సువార్త పని చేశాడు. ఎపఫ్రొదితును నాతోడి యోధుడని పిలుస్తున్నాడు. మనమందరము సైనికులము. క్రీస్తుతోడి యోధులము. మనము పోరాడేది మనుష్యులతో కాదు. మన ఆయుధాలు సాతాను దుర్గాలను పడద్రోయ శక్తి గలవి. ప్రతి ఆలోచనను క్రీస్తు కొరకు చెరపట్ట శక్తి గలవి. మనము ప్రభువు యొక్క మంచి సైనికునివలె శ్రమ పడాలి. వాక్యము ప్రార్థనల ద్వారా పోరాడాలి. క్రీస్తును సర్వాంగ కవచముగా ధరించుకోవాలి. ఫిలిప్పీయుల విషయము పౌలుకు తెలియజేసిన వార్తాహరుడు. పౌలుగారికి ఫిలిప్పీయులు చేసిన పరిచర్యలోని లోపము తీర్చినవాడు. పౌలుగారికి చెరసాలలో సేవ చేసినవాడు. అతడు రోగియై ఫిలిప్పీయులను చూడ మిగుల అపేక్ష గలవాడైయుండెను. దేవుడు తనని బాగు చేసి పౌలు గారి దుఃఖమును తగ్గించెను. అతని యెడల ఫిలిప్పీయులకు కలిగిన దుఃఖము తీరుటకై అతనిని మరల ఫిలిప్పీయుల వద్దకు పంపుచున్నాడు. క్రీస్తు యొక్క పని విషయము అతడు తన ప్రాణమునైనను లక్ష్యపెట్టక చావుకు సిద్ధమైయుండెను. ఇట్టి ప్రేమ గల సహోదరుని చేర్చుకొననివారెవరుంటారు? ఘనపరచనివారెవరు ఉంటారు? నిజముగా ఎపఫ్రొదితు మనకు మంచి మాదిరి. క్రీస్తు మనసు కలిగినవాడు.

## ముగింపు

ఇట్టి గొప్ప మనసు మనలో లేకపోవడానికి, కారణాలను కొన్నిటిని పరిశీలిద్దాం.

1. ప్రతి విశ్వాసిని క్రీస్తునందు చూడలేకపోవడం
2. ప్రతి విశ్వాసిని ప్రభువునందు అంగీకరించలేకపోవడం
3. తోటి విశ్వాసిని సంఘములో సాటి అవయవముగా చూడలేకపోవడ.
4. ఇతరులను చిన్నచూపు చూడడం
5. తననుతాను తగినదానికంటే ఎక్కువగా ఎంచుకోవడం
6. వ్యర్థమైన అతిశయము
7. స్వకీయ ప్రేమ
8. దేవుని యొద్ద ఆత్మీయ పాఠాలు నేర్చుకోలేని స్థితి
9. రూపాంతరము పొందని మనస్సు
10. ఇతరులలోని మంచిని యోగ్యతను గుర్తించలేకపోవడం.
11. సంఘమును, సహవాసమును ప్రేమించలేకపోవడం.
12. లోకం మీద అమితమైన ప్రేమ, వస్తు ప్రేమ
13. ప్రతి విషయంలో ఆత్మీయ కనుదృష్టి లేకపోవడం
14. బలహీనులను క్షమించలేకపోవడం
15. సమస్యలను వాక్యము, ప్రార్థనల ద్వారా పరిష్కరించలేకపోవడం

మొదలగు బలహీనతలు తొలిగింపబడి క్రీస్తు మనసుతో స్వంత కార్యములను మాత్రమేగాక ఇతరుల కార్యములను, క్రీస్తు కార్యములను గూర్చి ఆలోచించడానికి ప్రభువు మనకు సహాయము చేయునుగాక!

– **జక్కి దేవరాజు,** విజయవాడ



# సిలువకు శత్రువులు

క్రైస్తవ జీవితంలో ప్రవర్తన చాలా ప్రాముఖ్యమైనది. "ఒక వ్యక్తికి ఏముంది, ఏమిలేదు, అతనేం చేస్తాడు అనే దానికన్నా అతడు ఎలాంటివాడు అన్నదే చాలా ప్రాముఖ్యం". మన నైపుణ్యాలు మన గొప్పదనాన్ని, మన పని సామర్థ్యాన్ని తెలియజేస్తే, మన ప్రవర్తన మన విలువను తెలియజేస్తుంది.

నేటి స్థానిక సంఘాలు, సంఘ అనుబంధ సంస్థలు, శాఖలు మొదలగు వాటిలో ఉన్న వారి ప్రవర్తనను గూర్చి చాలా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. చాలామంది విశ్వాసులు తమ ప్రవర్తన ద్వారా క్రీస్తు సిలువకు సన్నిహితులుగా మారాల్సిందిపోయి శత్రువులుగా మారుతున్నారు. నాయకులు కూడా ఈ విషయంపై దృష్టిపెట్టకుండా, బోధించడం, సౌవార్తీకరణ, సంఘాలను కట్టడం, ఇతర పరిచర్యలు, సాంప్రదాయ క్రైస్తవ కార్యక్రమాలపై దృష్టిపెడుతున్నారు. ప్రభువిచ్చిన విలువైన పరిచర్యను విలువలులేని జీవితాలతో చేస్తున్నారు. అందువల్ల క్రైస్తవ పరిచర్య సమాజంలో చూపించాల్సిన ప్రభావాన్ని చూపించలేకపోతుంది.

## సిలువకు శత్రువులు ఎవరు?

ఫిలిప్పీ పట్టణంలోనున్న పరిశుద్ధులకు పౌలు ఒక ఉత్తరాన్ని రాశాడు. దానిలో 4 అధ్యాయాలు 104 వచనాలు ఉన్నాయి. 3వ అధ్యాయం 18వ వచనంలో పౌలు "అనేకులు సిలువకు శత్రువులుగా నడుచుకొనుచున్నారు" అని రాశాడు. క్రైస్తవ సంఘంలో సభ్యులుగా, అధ్యక్షులుగా, నాయకులుగాను, పాస్టర్స్‌గా, సంఘపెద్దలుగా... ఇలా అనేక బాధ్యతలు కలిగిన వారు యేసుక్రీస్తు సిలువకు విరోధముగా, శత్రువులుగా జీవిస్తుండగా పౌలు వారిని చూచి ఎంతో దుఃఖాన్ని కలిగియున్నాడు. మేము ప్రభువును రక్షకునిగా అంగీకరించామంటూ అనేకులు సంఘములోనికి, లేక సహవాసములోనికి, ఇయులోకి ప్రవేశిస్తారు. గొఱ్ఱె చర్మం వేసుకొని వస్తారు. అయితే లోపల వారు క్రూరమైన తోడేళ్లు (మత్తయి 7:15,16). వారి జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే వారి ఫలముల వలన మనము అట్టివారిని గుర్తించగలం. ఎందుకంటే వారి మనస్సు

భూసంబంధమైన వాటి మీదే ఉంటుంది. వారి కడుపే వారికి దేవుడు. వారు తాము సిగ్గుపడాల్సిన సంగతులయందు అతిశయిస్తారు. నాశనమే వారి అంతము (ఫిలిప్పీ 3:19).

## వారి జీవనశైలి

'కడుపు' అన్నప్పుడు – 'మన వాంఛలు' అని చెప్పవచ్చు. వారి వాంఛలు తీర్చుకోవడం కోసం తాపత్రయపడతారు. ఇలాంటి వారు సహవాసములో మంచి భోజనం కొరకు, తినడం కోసమే పుట్టినట్లు ఉంటారు. వారి ప్రాధాన్యత అంతా తిండిమీదే ఉంటుంది. మరికొందరు అధికారం చెలాయించడానికి బహుగా ఆరాటపడతారు. ఎప్పుడూ వారికి ఏదో పదవి ఇవ్వాలి. ఇవ్వకపోతే వారు ఇతరులను బ్రతకనివ్వరు. ఇది వీరి వాంఛ. పదవులలో ఉండి అధికారం చెలాయిస్తూ, అందరూ తమకు లోబడాలని ఎంతో ఒత్తిడి చేస్తారు. అంతేకాదు, ప్రసంగాలు చేయడానికి వారికి అవకాశం ఇవ్వాలి. ప్రసంగం చేసిన తరువాత "వారు ఎంతో గొప్పగా ప్రసంగిం చారని" చెప్పేలా చేస్తున్నారు. అలా చెప్పకపోతే వారికి విస్తారమైన కోపము వస్తుంది. మీటింగ్స్, సువార్త సభల్లో తప్పకుండా వారికి ఏదో ఒక పాత్ర ఇవ్వాలి. పాటలు పాడమనో, ప్రసంగం చేయమనో, ప్రార్థన చేయమనో ఆహ్వానించాలి. మీ వలననే మన సంఘం వృద్ధిలోనికి వచ్చింది, మీ వలననే మన ఇయు సహవాసములో ఇంతమంది మారుమనస్సు పొందారని చెప్పాలి. మనము చెప్పకపోతే వారు చెప్పుకొంటారు, ఎప్పుడూ వీరిని పోగుడుతూ ఉండాలి. పొగడకపోతే వీరికి ఎంతో చికాకు కలు గుతుంది.

మరికొందరుంటారు – వీరు ప్రసంగం చేయడానికి వెళితే వారి బైబిల్ మరొకరు తీసుకొచ్చి, వీరు స్టేజ్ మీద నిలబడినప్పుడు చేతికి అందివ్వాలి. కాన్ఫరెన్స్‌ల్లో వీరిని కొంచెం సేపైనా స్టేజ్ మీద కూర్చోబెట్టాలి. వీరికి స్టేజ్ పిచ్చి. మళ్ళీ ఎంతో వినయం ఉన్నట్లు ప్రవర్తిస్తారు. అయితే వీరి అంతరంగములో వీరికి విపరీతమైన కోరిక ఏంటంటే స్టేజ్ మీద నిలబడి ఏవోమాటలు అందరికి చెప్పాలి. మరికొందరుంటారు... వీరికి కమిటీ పిచ్చి. ఎప్పుడూ ఏదో ఒక కమిటీలో ఉండాలి. లేదా, వీరి సల హా లేకుండా ఇతరులను ఎవ్వరిని ఏ కమిటీలోను పెట్టకూడదు. వారి యొక్క అజమాయిషీలో కమిటీ మెంబర్స్ నియమించబడాలి. కొంతమందికి వయస్సు పెరిగేకొలది కమిటీస్‌లో ఉండాలన్న పిచ్చి పెరుగుతూ ఉంటుంది. అందుకేవారు అనేక సంస్థలలో సభ్యత్వం కలిగి ఉంటారు. మీరు లేకపోతే ఈ సంస్థ నడవదు అని అందరూ వీరిని పైపైకి ఎక్కించాలి. ఇలాంటి ప్రవర్తన కలిగినవారిని, ఇలాంటి హృదయం కలిగి జీవించేవారిని పౌలు "సిలువకు శత్రువులు" అని పిలుస్తున్నాడు.

## ప్రాచీన స్వభావాన్ని ప్రభువు సిలువలో చంపేశాడు

తనను వెంబడించాలని ఆశించేవారితో ప్రభువు చెబుతున్న మాటల్ని జ్ఞాపకం చేసుకొందాం. "నన్ను వెంబడింపగోరువాడు తననుతాను ఉపేక్షించుకోవాలి. ప్రతిదినము తన సిలువను ఎత్తుకోవాలి". ఈ రెండు షరతులు నెరవేర్చనివాడు ప్రభువును వెంబడింపలేడు. క్రీస్తుప్రభువును వెంబడింపగోరువానికి సిలువ ఎంతో అవసరం. దేవునికి విరోధమైన మన శరీరకార్యాల ను (గలతీ 5:19–21) సిలువ కిందకు తీసుకొని రావాలి. యేసుక్రీస్తు ప్రభువు యొక్క సిలువ మనకు పాపక్షమాపణ ఇచ్చింది. అంతమాత్రమే కాదు, ప్రాచీన స్వభావం మేకులతో సిలువకు కొట్టబడి చంపివేయబడింది (రోమా 6:6). ప్రభువు తన సిలువ మరణములో క్రూరంగా హింసింపబడి చంపబడినప్పుడు – మన పాపస్వభావం కూడ చంపబడింది. అనగా ఈ లోకములో మన ప్రాచీన స్వభావము యొక్క అధికారానికి లోబడి జీవించాల్సిన పనిలేదు. ఎందుకంటే మన ప్రాచీన స్వభావాన్ని ఆయన సిలువలో చంపేశాడు. ఒకవేళ ప్రభువు సిల ువలో మరణించి ఉండకపోతే, మనిషి ఎల్లప్పుడును ప్రాచీన స్వభావానికి దాసుడై ప్రాచీన స్వభావాన్ని అనుసరించి జీవించవలసిందే.

**క్రీస్తు సిలువకు శత్రువులు అనగా సిలువను ఎత్తికోకుండా ప్రభువును వెంబడించేవారు, సిలువ కార్యము తమ జీవితాల్లో జరగడానికి ఒప్పుకోనివారు. వారి మనస్సు భూసంబంధమైన వాటి మీదే ఉంటుంది. వారి కడుపే వారికి దేవుడు. వారు తాము సిగ్గుపడాల్సిన సంగతుల యందు అతిశయిస్తారు. నాశనమే వారి అంతము (ఫిలిప్పీ 3:19).**

## మన శరీర కార్యాల్ని చంపివేయాలంటే?

మనిషిలో అబద్ధాలు చెప్పే, అసూయపడే స్వభావం బాల్యంనుండి కన్పిస్తూనే ఉంటుంది. దీనినే ప్రాచీన స్వభావం అని చెప్పవచ్చు. ఒక వ్యక్తి యేసుక్రీస్తు ప్రభువును విశ్వసించిన తర్వాత కూడా ఈ చెడ్డ స్వభావం కన్పిస్తూ ఉంటుంది. ప్రభువును నమ్మినా ఎందుకు ఈ స్వభావము నాలో కన్పిస్తుంది? అనే ప్రశ్న ఏర్పడుతుంది. నిజానికి ప్రభువు తన సిలువ మరణమందు మన పాపస్వభావాన్ని చంపివేశాడు. అయితే ఆ సిలువ కార్యము నీ జీవితములో అనుభవించాలి. దానికోసం దేవునిని అడగాలి.

చచ్చినవాడు కదలడు, మెదలడు, కనీసం కన్ను కూడ తెరవలేడు, గాలి కూడ పీల్చుకోలేడు. ఎందుకనగా వాడు చచ్చిపోయాడు. గనుక మనం కుమారుని నామంలో తండ్రిని అడిగినప్పుడు మనలోనున్న పరిశుద్ధాత్మ దేవుడు క్రీస్తుప్రభువు యొక్క సిలువ కార్యాన్ని మనలో జరిగిస్తాడు. మనయందు సజీవముగానున్న శరీరకార్యాల్ని సిలువపై మేకులతో కొట్టి చంపేసి మనలను క్రీస్తు స్వారూప్యములోనికి మార్చుతాడు. అయితే మనము తండ్రిని అడగాలి. అడగడం అంటే మనలో ఉన్న శరీరకార్యములు చంపబడాలని కోరుచున్నామని అర్థము. అడగకపోతే శరీరకార్యాల్ని ఎప్పటికీ జయించలేక సిలువకు శత్రువులుగానే జీవిస్తూ ఉంటాము. "అడుగుడి మీకు ఇయ్యబడును" అడుగు ప్రతివానికి ఇయ్యబడును (లూకా 11:10) అని ప్రభువు చెప్పాడుగదా! గనుక మనలో ఉన్న ప్రతి శరీరకార్యం చంపబడాలంటే మనము ప్రభువును అడగాలి.

క్రీస్తు సిలువకు శత్రువులు అనగా సిలువను ఎత్తికొనకుండ ప్రభువును వెంబడించేవారు, సిలువ కార్యము తమ జీవితాలయందు జరుగడానికి ఒప్పుకోనివారు. "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అని ప్రభువు మనకు ఆజ్ఞ ఇచ్చారు. అయితే మనలోనున్న ప్రాచీనస్వభావము ఎంతమాత్రమూ దీనికి ఒప్పుకోదు. ఒప్పుకోని మన స్వభావాన్ని ప్రభువు యొక్క సిలువకు అప్పగిస్తే మనవలె మన పొరుగువానిని ప్రేమించడానికి ఇష్టపడని స్వభావాన్ని పరిశుద్ధాత్మ దేవుడు మేకులతో సిలువకు కొడతాడు, అప్పుడు అది సిలువలో చంపబడుతుంది. అలాగే ఇతరులను క్షమించలేని స్వభావాన్ని దేవుని దగ్గర ఒప్పుకొన్నప్పుడు నమ్మదగిన దేవుడు మనలను క్షమించి, దుర్నీతినుండి కడిగి తన పవిత్ర స్వభావమును మనకు అనుగ్రహిస్తాడు (1 యోహాను 1:9). ఈయన అద్భుతమైన దేవుడు మనలోనున్న ప్రాచీనస్వభావమును ఒప్పుకున్నప్పుడు తన కుమారుని యొక్క సిలువను బట్టి ప్రాచీన స్వభావమును చంపి మనలను పవిత్రపరుస్తాడు.

## ప్రతిదినం తన సిలువను ఎత్తుకోవాలి

ఈ ప్రక్రియ మనిషి ఈ భూమ్మీద బ్రతికినంతకాలము చేస్తూనే ఉండాలి. అందుకే 'లూకా 9:23'లో ప్రతిదినము సిలువనెత్తుకొని తనను వెంబడించాలని ప్రభువు చెప్పారు. మనము కంటిచూపులతోను, చేతులతోను పాపము చేయకుండ ఉండాలంటే (మత్తయి 5:27-30) ప్రార్థనలో తండ్రికి చెప్పుకోవాలి. ఆయన మనలోని శరీరకార్యాలను సిలువకు కొట్టి మనకు పరిశుద్ధ హృదయాన్ని, నీతిగల కంటిచూపులను అనుగ్రహిస్తాడు.

## ఆయనకు వేరుగా ఉంటే పరిశుద్ధ జీవితం కలుగదు.

ప్రభువు కృప కొరకు కనిపెట్టుకోవడం ద్వారా మనుష్యులు దేవునికి ఇష్టమైన పరిశుద్ధ జీవితాన్ని, సిలువవేయబడిన జీవితాన్ని జీవిస్తారు. ఆయనకు వేరుగా ఏ వ్యక్తి పరిశుద్ధ, సిలువవేయబడిన జీవితం జీవించలేడు. స్వంత ప్రయత్నాలు చేస్తే తప్పక ఓడిపోతారు. మనము పరిశుద్ధ జీవితం, సిలువ వేయబడిన జీవితం జీవించకుండా నిరంతరం మన మీద దాడిచేసే ముగ్గురు శత్రువులు ఉన్నారు.

1. శరీరము (శరీర కార్యములు-గలతీ 5:19-21).
2. లోకము (1 యోహాను 2:15-17)
3. శత్రువగు సాతానుడు, అతనితో కూడా ఉన్న దురాత్మలు (ఎఫెసీ 6:12)

ఈ ముగ్గురిని జయించి ముందుకు సాగాలంటే నిత్యము ప్రభువు వైపు చూస్తూ ప్రభువు కృపకొరకు కనిపెట్టుకోవాలి. అప్పుడు ప్రభువే మనలను తన నామమును బట్టి నీతిమార్గములలో నడిపిస్తారు (కీర్తనలు 23:3).

– డా. పిట్టా సిరాజ్, ఇవాంజిలిస్ట్, విజయవాడ

## శరీరానుసారి

# ఆత్మసంబంధి

ప్రపంచంలోని వ్యక్తులను మనం మూడు రకాలుగా విభజించవచ్చు. ప్రకృతి సంబంధులు, శరీర సంబంధలు, ఆత్మ సంబంధులు. రక్షణ పొందని వారిని ప్రకృతి సంబంధులు అని అంటాము. శరీర సంబంధి, ఆత్మ సంబంధి ఇద్దరూ విశ్వాసులే. వీరిలో శరీర సంబంధులు యేసును అంగీకరించి కొద్దికాలం కొనసాగి దేవున్ని తన జీవితానికి ప్రభువుగా అంగీకరించకుండా తమను తామే ఏలుబడి చేసుకొంటారు. ఆత్మసంబంధులు ఆత్మానుసారముగా ప్రవర్తిస్తూ, ఆత్మ విషయముల మీద మనస్సుంచుతారు. శరీర సంబంధికి ఆత్మ సంబంధికి ఉన్న తేడా అంతా ఆత్మీయ జీవితం యొక్క అభివృద్ధిలోనే ఉంటుంది.

### 1. ప్రకృతి సంబంధులు

ప్రకృతి సంబంధి అవిశ్వాసి. క్రీస్తును కలిగి ఉండడు. పాప పురుషునితో నింపబడి ఉంటాడు. స్వచిత్తం హృదయంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి ఉంటుంది. గలతీ 5:19-20 ప్రకారం శరీర క్రియలతో నింపబడి ఉంటాడు.

1. దేవుని ఆత్మ విషయాలను అంగీకరించడు (1 కొరింథీ 2:14)
2. అవి అతనికి వెర్రితనముగా ఉంటాయి (1 కొరింథీ 2:14)
3. అతడు ఆత్మవిషయాలను గ్రహింపజాలడు (యూదా 1:19)
4. వారు పరిశుద్ధాత్మ తమలో లేనివారు
5. వారు భేధాలు కలుగజేచేస్తారు (యూదా 1:19)
6. ప్రకృతి సంబంధమైన జ్ఞానము పరలోక జ్ఞానము వంటిది కాదు (యాకోబు 3:15)
7. అది దయ్యముల జ్ఞానము వంటిది (యాకోబు 3:15)



ప్రకృతి సంబంధి ఆత్మ విషయాలను గ్రహించడు కాబట్టి వాటిని అంగీకరించలేడు. తనకున్న ప్రకృతి జ్ఞానాన్ని అనుసరించి ప్రవర్తిస్తాడు, నిర్ణయాలు తీసుకొంటాడు. కొరింథీ సంఘంలో గ్రూపులు ఏర్పడ్డాయి. ఒకడు నేను పౌలు వాడను, మరొకడు నేను అపొల్లోవాడను, మరొకడు నేను కేఫా వాడను అని చెప్పుకొంటున్నారంటే అభిమాన సంఘాలు ఏర్పడినట్లే. అభిమాన సంఘాల మధ్య పోటీ, కలహాలు ఉంటాయి. మనమంతా క్రీస్తుకు చెందినవారము. ఒకే కుటుంబంలోని వారము. మనకు ఎన్ని అభి ప్రాయభేదాలు ఉన్నప్పటికి ఐక్యత ఉండాలి. మనము వ్యక్తుల ఆధారంగా, గ్రూపులుగా విడిపోతే మనము ప్రకృతి సంబంధులమే.

యాకోబు రాసిన పత్రికలో ప్రకృతి సంబంధి యైనవాడు సాత్వికత లేక, అయోగ్యమైన ప్రవర్తన కలిగి, మత్సరము, వివాదము ఉంచుకొని అబద్ధమాడేవాడుగా ఉంటాడు అని రాయబడింది (యాకోబు 2:13-14).

యూదా రాసిన పత్రికలో అబద్ధ బోధకులను ప్రకృతి సంబంధమైన మనుష్యులతో పోలుస్తాడు. వారు గ్రహింపరాని విషయాలను గూర్చి ద్వేషిస్తూ వివేకములేని వారుగా ఉంటారని రాయబడింది.

అంతేకాకుండా వారు పరిశుద్ధాత్మ లేనివారై భేధాలు కలుగజేస్తారని రాయబడింది.

## 2. శరీర సంబంధులు

శరీర సంబంధులు యేసును అంగీకరించి కొద్దికాలం మంచిగా దేవునిలో కొనసాగి రానురాను దేవున్ని ప్రభువుగా అంగీకరించకుండా తమను తామే ఏలుబడి చేసుకునేవారు. వీరిలో పరిశుద్ధాత్ముడు నివసిస్తాడు గానీ, వారు పరిశుద్ధాత్ముని యొక్క సంపూర్ణ అధికారం కిందకు రారు. క్రీస్తు స్థానంలో స్వచిత్తం వచ్చి అదే వారి జీవితాన్ని పాలిస్తూ ఉంటుంది. వీరి జీవితాల్లో పాక్షిక విధేయత, వేషధారణ కనిపిస్తాయి. ఈ క్రింది లక్షణాలను బట్టి శరీర సంబంధులు ఎవరో గుర్తించవచ్చు.

1. శరీరానుసారులు దేవుని విషయాల మీద కాక శరీర విషయముల మీద మనస్సును ఉంచుతారు.
2. శరీరానుసారమైన మనస్సు దేవుని ధర్మశాస్త్రానికి ఎంతమాత్రము లోబడదు.
3. శరీర స్వభావము గలవారు దేవుని సంతోష పరచలేరు.
4. శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధము
5. శరరానుసారమైన మనస్సు మరణము.
6. శరీర సంబంధులు బలహీనులుగా, ఆత్మీయంగా ఓడిపోయిన, రాజీపడిన స్థితిలో ఉంటారు.
7. శరీర కార్యాలు జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరము, క్రోధములు, కక్షలు, బేధములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు. ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు అని పౌలు చెప్పారు.




పై లక్షణాలను గమనించినప్పుడు వీరి స్వభావం, ప్రవర్తన ప్రకృతి సంబంధులకు సమీపంగా ఉన్నట్లే కనిపిస్తుంది. శరీరకార్యాలు అన్నీ వీరి జాబితాలో లేకపోయినప్పటికి కొన్నింటిని చేస్తూ తమలో ఉన్న పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తూ ఉండే అవకాశం ఉంది.


## 3. ఆత్మసంబంధులు

వీరు పరిశుద్ధాత్మను కలిగి, ఆత్మానుసారముగా ప్రవర్తిస్తారు, ఆత్మ విషయాల మీద మనస్సు ఉంచుతారు. దేవుని ఆత్మ విషయాలను అంగీకరిస్తారు. ఆత్మానుభవముచేత వివేచిస్తారు. వాటిని గ్రహిస్తారు.

1. ఆత్మచేత నడిపించబడతారు.
2. ఒకరికొకరు వివాదము రేపక ఉంటారు. ఒకరిపట్ల, మరొకరు అసూయపడకుండా ఉంటారు.
3. వృధాగా అతిశయపడకుండా ఉంటారు.
4. క్రమముగా, ప్రేమగా నడుచుకొంటారు.
5. ఇంద్రియ నిగ్రహము గలవారుగా, ఆత్మస్వభావము కలిగి ఉంటారు.
6. ఆత్మచేత నియంత్రించబడతారు.
7. ఆత్మఫలాన్ని ఫలిస్తారు (గలతీ 5:22)

మనము ఆత్మసంబంధులముగా ఉండాలంటే మన ప్రాచీన స్వభావము సిలువ వేయబడిందని ఎరగాలి. పరిశుద్ధాత్మచేత శరీర క్రియలు చంపాలి. నూతన స్వభావము (నవీన స్వభావము) అనుదినము బలపరచబడుతూ ఉండాలి. మనము ఆత్మసంబంధులుగా చెప్పుకొంటూ శరీరస్వభావంతో ప్రవర్తిస్తే సహవాసాల్లో సమస్యలు ఏర్పడతాయి. ఒక చర్య, ప్రతిచర్య, ఒక వైఖరి, ఒక విలువ ఆత్మసంబంధమైనదా, శరీర సంబంధమైనదా అని ఒక ఆత్మసంబంధి సులువుగా గ్రహిస్తాడు.

మనము ఆయన వాక్యములో నిలిచియుంటే బహుగా ఫలిస్తామని మనకు తెలుసు. ఆత్మఫలము, ప్రేమ, సంతోషము, సమధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఆత్మఫలములో ఉండే 9 లక్షణాలలో 4 వ్యక్తిగతమైనవి, 5 సంబంధాలకు సంబంధించినవి.




ఉదాహరణకు ప్రేమ, దయాళుత్వము, సమాధానము, మంచితనము, సాత్వికము మొదలైనవి సంబంధాలలో వెల్లడి అయ్యే లక్షణాలు.

గలతీ 5:16లో ఆత్మానుసారముగా నడుచుకొనుడి. అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరని రాయబడింది. శరీరము ఆత్మకు, ఆత్మ శరీరమునకు విరోధముగా అపేక్షించును. అవి ఒకదానికి మరొకటి వ్యతిరేకంగా ఉంటాయి అని రాయబడింది. క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని ఇచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేయబడియున్నారు అని రాయబడింది.

మనము తిరిగి జన్మించిన తరువాత మన హృదయాలలో పరిశుద్ధాత్ముని పని, మనలను దేవుని పోలికలోనికి అనుదినము మార్చుతూ ఆయన స్వరూపములోనికి మార్చడమే. ఆత్మసంబంధి పరిశుద్ధాత్మచేత నింపబడి ఆత్మ దేవుని ఆధీనంలో ఉంటూ నడిపించబడతాడు. శరీరసంబంధి శరీర సంబంధమైన కోర్కెలు, ఆశల ద్వారా నడిపించబడతాడు. శరీరేచ్ఛలు వారి జీవితంలో ప్రముఖపాత్ర వహించి, అధికారం చూస్తాయి.

శరీరానుసారులు దేవుని సంతోషపరచలేరు. శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధం. అది దేవునికి లోబడదు గనుక వీరేమి చేయాలనుకొంటున్నారో అది చేయలేరు అని రాయబడింది.

పౌలు రోమా పత్రిక 7వ అధ్యాయంలో మేలు చేయవలెనని కోరిక నాకు కలుగుచున్నది గాని దానిని చేయడం నాకు సాధ్యపడటం లేదు అని వాపోతూ దానికి గల కారణం చెప్పాడు. అది నాలో నివసించు పాపమే అని రాస్తూ అది నేను కాదు అంటాడు. నాలో ఉన్న పాప నియమం నన్ను చెరపట్టి లోపరచుకొంటూ నా మనస్సులో ఉన్న ధర్మశాస్త్రముతో పోరాడుతుంది అని చెబుతాడు. అయితే దీనికి పరిష్కారం క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమం పాపమరణ నియమములనుండి నన్ను విడిపించెను అని రాస్తాడు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొంటూ మనము నూతన స్వభావాన్ని పోషిస్తూ ఆత్మసంబంధులుగా ఉందాము.

శరీరసంబంధులుగా నడిచేవారు రోమా 6; 11, 8:13, 12:1-2లో చెప్పినట్లు మనం మన పాపముల విషయమై పశ్చాత్తాపపడుతూ ఆయన వలన క్షమాపణ పొందినప్పుడు ఆత్మనుసారమైన జీవితం వృద్ధి పొందుతూ శరీరానుసార జీవితం తగ్గించబడుతుంది. దీనిని పవిత్రీకరణం అంటారు. కావున మనం మన పాపముల విషయమై దిన దినం చనిపోతూ, ఆత్మీయంగా జీవిస్తూ ఆయన స్వారూప్యంలోకి మారునట్లు ప్రభువు కృప మనందరికి తోడై ఉండునుగాక !

**– జి. జెర్మియా ప్రసాద్,** ఏపి-ఇజియఫ్ స్టాఫ్, తుని




# సాకులు, స్వార్థంతో ప్రభువు పని ఆపొద్దు

చెరలో నుండి వచ్చిన తర్వాత రాసిన మొదటి పుస్తకం హగ్గయి గ్రంథం. జెరుబ్బాబెలు నాయకత్వంలో కొంతమంది యూదులు యెరూషలేముకు తిరిగి వచ్చి దేవుని మందిరం నిర్మించడానికి పునాది వేసి పని ప్రారంభించారు. అయితే శత్రువుల దగ్గరనుండి ఆటంకాలు ఎదురవ్వడంతో దేవుని మందిరపు పని ఆగిపోయింది. దాదాపు పదహారు సంవత్సరాలు దేవుని మందిరం గూర్చి ఆలోచించటం మానేశారు. ఇప్పుడు వారి ప్రాధాన్యతలు మారిపోయాయి. ఏ ఉద్దేశంతో బబులోను చెరనుండి వచ్చారో దాన్ని మరచిపోయి ఇళ్ళు కట్టుకోవడం, వాళ్ళ కుటుంబాలను స్థిరపరచుకోవడంలో మునిగిపోయారు. ఈ సమయంలో దేవుడు ప్రవక్త అయిన హగ్గయి ద్వారా తిరిగి మందిరం కట్టడానికి పిలుపు ఇస్తున్నాడు.

విశ్వాస విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా, స్టాఫ్‌గా దేవుడు మనల్ని రక్షించి, నశించిపోతున్న విద్యార్థుల జీవితాలను కట్టడానికి దేవుడు పిలిచాడు. మన పితరులు దేవుని పిలుపుకు తగినట్లుగా నడుచుకొన్నారు. ఇశ్రాయేలీయులవలె మనం కూడా చాలాసార్లు దేవుని పిలుపును మరచిపోయి ఇహలోక సంబంధమైన విషయాలకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తున్నాము.

నాలుగు నెలల వ్యవధిలో దేవుని వాక్కు నాలుగు సార్లు హగ్గయికి ప్రత్యక్షమై నాలుగు ప్రాముఖ్యమైన విషయాలను బయలుపరచాడు.

### 1. దేవుని పనికి పిలుపు (1 అధ్యాయం)

ప్రవక్తయైన హగ్గయికి దేవుని వాక్కు ప్రత్యక్షమై “ఈ మందిరమును కట్టిస్తే దానియందు నేను సంతోషించి నన్ను ఘనపరచుకొంటానని యెహోవా సెలవిస్తున్నాడు. దేవుని మందిరం కట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. దేవుని మందిరం కడితే దేవుని సన్నిధి వాళ్ళకి దొరికి, దేవునికి దూరమై చెరలో అలసిన వాళ్ళ జీవితాలకు ఊరట దొరుకుతుంది. వాళ్ళ ఆధ్యాత్మిక జీవితాలు పునరుద్ధరించబడతాయి. వాళ్ళ పాపాలగూర్చి పశ్చాత్తాపపడి ప్రాయశ్చిత్తం చేసుకోడానికి అవకాశం కలుగుతుంది.

ఈ తరంలో కూడా దేవుడు మనల్ని తన సువార్త పనికి పిలుస్తున్నాడు. ఆయన సువార్త ప్రకటించాల్సిన అవసరం ఎంతో ఉంది. సువార్త ప్రకటిస్తే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయి. వాళ్ళు సత్యాన్ని తెలుసుకొని నిజమైన జీవితాన్ని అనుభవిస్తారు. తద్వారా కుటుంబాలు, సమాజం, భారతదేశం బాగుపడుతుంది. అలాంటి ఉన్నతమైన పనికి దేవుడు మనల్ని పిలిచాడు.

### దేవుని మందిర పనిని ఆపివేసి ఆయన ప్రజలు చేసిన పనులు

#### ఎ. సాకులు చెబుతూ వాయిదా వేయడం (1:2)

దేవుని మందిరం కట్టడానికి ఇంకా సమయం రాలేదని వాళ్లకు వాళ్ళే సర్ది చెప్పుకొంటున్నారు. మనం కూడా చాలాసార్లు దేవుని పని చేసే క్రమంలో కొన్ని అవాంతరాలు ఎదురైతే విశ్వాసంతో, ధైర్యంతో ప్రార్థనా పూర్వకంగా ముందుకు వెళ్ళకుండా ఆగిపోతాము, లేదా ఇప్పుడు కాదులే అని

సర్ధిచెప్పుకొంటాము. అవాంతరాలేమీ లేనప్పటికీ మనమే కదలని వారంగా మిగిలిపోతాము. ఇప్పుడు బిజీగా ఉన్నాము, తర్వాత చూద్దాంలే, మనం ఎంత చెప్పినా వాళ్ళు మారరులే అని, ఇప్పటి తరాన్ని రీచ్ అవ్వడం కష్టమని, మొబైల్ వచ్చిన తర్వాత సువార్త చాలా కష్టమైందని ఇలా అనేకమైన సాకులతో మనం దేవుని పనిని చేయకుండా వాయిదాలు వేస్తున్నాము.

### బి. స్వార్థాన్ని చూసుకోవడం (1:2)

దేవుని ప్రజలకి మందిరం కట్టడానికి సమయం లేదు కానీ వాళ్ళ ఇల్లు కట్టుకోవడానికి సమయం ఉంది. మంచి సారంబి గృహాలు నిర్మించుకొని సంతోషకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. సుఖవలయంలో ఉండిపోయారు. మనం కూడా చాలాసార్లు సువార్త ప్రకటించడానికి, విద్యార్థులతో సమయాన్ని గడపడానికి, ప్రోగ్రామ్స్‌కి రిట్రీట్స్‌కి హాజరవ్వడానికి, బైబిల్ స్టడీస్ తీసుకోవడానికి హాస్టల్స్ సందర్శించడానికి యంపిసి విద్యార్థులను కలవడానికి, దేవుని పని చేయటానికి సమయం ఉండదు కానీ మన సొంత పనులకి సమయం ఉంటుంది. మన సమయాన్ని చాలాసార్లు మొబైల్‌తో, షాపింగ్ చేయడం లాంటి వాటితో గడిపేస్తాం. మన సామర్థ్యాల్ని ఎక్కడెక్కడో ఖర్చు చేస్తాం. మరికొంతమంది కంఫర్ట్ జోన్‌లో నుంచి బయటికి రాడానికి, శ్రమ పడడానికి ఇష్టపడరు. ఇంకొంతమంది వాళ్ళ కంఫర్ట్స్ దెబ్బ తినకుండా పని జరగాలనుకొంటారు. చెమట కారకుండా, ఇస్త్రీ బట్టలు నలగకుండా దేవుని పని జరగాలని అనుకొంటాం. మనం చాలాసార్లు ప్రభువు కోసం, ప్రభువు పని కోసం త్యాగం చేయడానికి, సవాళ్ళు ఎదుర్కోవడానికి ఇష్టపడము. అయితే దేవుడు ఇప్పుడైనా ఆయన పని చేయడానికి పిలుపునిస్తున్నాడు.

ఆయన ప్రజలు ఆయన మందిరాన్ని పట్టించుకోకుండా ఉండడాన్ని బట్టి వాళ్ళ జీవితంలో ఆశీర్వాదాన్ని కోల్పోతున్నారు (9-11). మనం కూడా ఆయన పనిని నిర్లక్ష్యం చేయటాన్ని బట్టి ఆశీర్వాదాన్ని ఫలభరితమైన జీవితాన్ని కోల్పోతున్నాం. ఇలా దేవుడు వాళ్ళని తిరిగి ఆయన పనికి పిలిచినప్పుడు జెరుబ్బాబెలు, ప్రధాన యాజకుడు, శేషించిన జనం ఆయన పని చేయడానికి ఆయనను సేవించడానికి నిర్ణయం తీసుకున్నారు (1:12).

## 2. దేవుని పనికి ప్రోత్సాహం (2:1-9)

దేవుడు మాట్లాడిన తర్వాత తిరిగి ప్రజలందరూ ఆయన పనిని ప్రారంభించారు. అయితే పూర్వపు మందిరాన్ని చూసిన పెద్దలు ఇప్పుడు మనం కట్టబోతున్న మందిరం దానికి ఏ పాటికి సరిపోదని, మనం అంత గొప్పగా కట్టగలమా? అని చెప్పుకుంటూ నిరుత్సాహానికి లోనవుతున్నారు. దేవుడు మరలా హగ్గయి ద్వారా వాళ్ళని ప్రోత్సహిస్తున్నాడు. దేవుడు తెలియజేసిన విషయాలు

1. ధైర్యంగా ఉండమన్నాడు.
2. నేను తోడుగా ఉంటానని చెప్పాడు.
3. ఆయన మహిమతో నింపుతానని వాగ్దానం ఇచ్చాడు.
4. ఆయన పనికి కావాల్సిన వనరుల్ని ఆయనే సమకూరుస్తానన్నాడు.

విద్యార్థుల మధ్య పనిచేస్తున్న మనకు కూడా ఎన్నో భయాలు, నిరుత్సాహపరిచే విషయాలు నిత్యం ఎదుర్కొంటూనే ఉన్నాం. కొద్దికొద్దిగా సువార్తకు ద్వారాలు మూసుకొంటున్నాయి. మతోన్మాదుల బెడద రోజురోజుకీ పెరిగిపోతుంది. ఇలాంటి ఆందోళనకరమైన సమయంలో దేవుడు ఆరోజు మందిరాన్ని తిరిగి నిర్మిస్తున్న ప్రజలతో మాట్లాడిన రీతిగా మనతో కూడా మాట్లాడుతున్నాడు. భయపడవద్దని ధైర్యంగా ఉండమని సెలవిస్తున్నాడు. ఆయన సన్నిధి మనకి ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది. అప్పటి స్టాఫ్ వర్కర్ సత్‌కీర్తిరావుగారు మత్తయి 28:19 గూర్చి "గ్రేట్ కమీషన్ ఈజ్ శాండ్‌విచ్ బిట్వీన్ హిజ్ పవర్ అండ్ ప్రజెన్స్" అని చెప్పేవారు. ఎందుకంటే 18వ వచనం ఆయన అధికారం గురించి మాట్లాడితే 20వ వచనం ఆయన సన్నిధి సదాకాలం తోడు ఉంటుందని చెబుతుంది. కాబట్టి మనం ధైర్యం తెచ్చుకొని ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం విద్యార్థుల ఆధ్యాత్మిక జీవితాల పురోగతి చూసినప్పుడు మనకు నిరుత్సాహం కలుగుతుంది. 'గతంలో పరిచర్య చాలా గొప్పగా జరిగేది ఇప్పుడు విద్యార్థులు ఎవరూ సరిగా లేరు' అని పోల్చుకొంటూ నిరాశ చెందుతున్నాము. ఎన్నిసార్లు హాస్టల్స్ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదనే నిర్ణయానికి

వస్తున్నాం. కరోనా తర్వాత విద్యార్థులు చాలా మారి పోయారు వాళ్ళు రారని చెప్పుకుంటూ పరిచర్యను వదిలేయడానికి సిద్ధపడుతున్నాం. కానీ దేవుడు ఇప్పుడు కూడా గొప్ప కార్యాలు జరిగించటానికి సిద్ధంగా ఉన్నాడు. విద్యార్థుల ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారుతున్నా సువార్త విద్యార్థుల జీవితాలను మార్చగలదు. సువార్త ఎప్పటికీ అసందర్భం కాదు. అప్పుడున్న దేవుడే ఇప్పుడూ ఉన్నాడు, అప్పుడు చేసిన గొప్ప కార్యాలు ఇప్పుడూ చేయగలడు. కావున సువార్త అనే వాడబారని బహుమానాన్ని విద్యార్థులకు అందిద్దాం. ఆయన మందిరం కట్టడానికి కావాల్సిన ద్రవ్యాన్ని ఆయనే సమకూర్చి నట్టు ఇప్పటి మన పరిచర్యకు కావాల్సిన వనరుల్ని ఆయనే సమకూరుస్తాడు. కాబట్టి ప్రస్తుత పరి స్థితులకు తగినట్టుగా సృజనాత్మకంగా ఆలోచిస్తూ సువార్త సత్యాలను విద్యార్థులకు అందిద్దాం.

### 3. దేవుని పనిలో పరిశుద్ధత (2:10-19)

దేవుడు హగ్గయి ద్వారా ప్రజలతో వాళ్ళ పవిత్రత గురించి మాట్లాడుచున్నాడు. ప్రజల పవిత్ర జీవితం గురించి యాజకుల ముందు దేవుడు రెండు ప్రశ్నలు ఉంచాడు. ఆ ప్రశ్నల సారాంశం అపవిత్రమైనవి చేస్తూ దేవుని పని చేస్తే అది అపవిత్రమవుతుంది. దేవుడు ఇక్కడ వాళ్ళ పనితో పాటు పవిత్రమైన జీవితాన్ని పవిత్రమైన అర్పణని కోరుకుంటున్నాడు. మన జీవితాల్లో కూడా పరిశుద్ధతను ఆయన కోరుకొంటున్నాడు. విద్యార్థుల మధ్య పరిచర్య చేస్తున్న మనం పరిశుద్ధత విషయంలో రాజీపడని గొప్ప సేవకులుగా ఉండాలని ప్రభువు కోరుకొంటున్నాడు. ఆయన మందిరాన్ని కడుతున్న ప్రజలు పవిత్రత లేని కారణాన్ని బట్టి ఆశీర్వాదాన్ని, అభివృద్ధిని చూడలేకపోయారు. అయితే ఇప్పటినుంచి పవిత్రత కలిగి సేవిస్తే ఆయన ఆశీర్వదిస్తానని, అభివృద్ధిని ఇస్తానని మాట్లాడుచున్నాడు. మనం కూడా పరి శుద్ధత కలిగి ఆయనను సేవిస్తే గొప్ప ఆశీర్వాదాన్ని, పరిచర్యలో అభివృద్ధిని చూడవచ్చు.

### 4. దేవుని పనివాడికి గుర్తింపు (2:20-23)

దేవుడు చివరిగా హగ్గయి ద్వారా జెరుబ్బాబెలు గురించి మాట్లాడుతున్నాడు. జెరుబ్బాబెలు గురించి మనం ఆలోచించినప్పుడు ఆయన రాజవంశానికి సంబంధించిన వ్యక్తి. అయితే పారశీక దేశపు రాజు ద్వారా చెరలో నుంచి దేవుని మందిరాన్ని కట్టడానికి, ప్రజల మీద గవర్నర్‌గా నియమితుడయ్యాడు. అయితే జెరుబ్బాబెలు ఆయన రాజరికాన్ని పక్కనపెట్టి అందరితో కలిసి ఆయన మందిరం కట్టడానికి ఎంతగానో శ్రమపడుతున్నాడు. ఆ శ్రమను దేవుడు గుర్తించాడు. జెరుబ్బాబెలు గురించి చెబుతూ 'నా సేవకుడని, నేను నియమించానని, ముద్ర ఉంగరంగా చేస్తానని' చెబుతున్నాడు. దేవుని దృష్టిలో చాలా ప్రియమైన వ్యక్తిగా కనబడుతున్నాడు. ముద్ర ఉంగరం ద్వారా రాజు ఆజ్ఞలను జారీచేసేవాడు. అంటే ఆ ముద్ర ఉంగరం ద్వారా గొప్ప పనులు జరిగేవి. అంతేకాదు ఆ ఉంగరం ఎప్పుడూ రాజు చేతి వేలికి ఉంటుంది. అదే రీతిగా దేవుడు జెరుబ్బాబెలు ద్వారా గొప్ప కార్యాలు జరిగించాలని ఇష్టపడుతున్నాడు. అంతే కాదు 'సన్నిహితుడు' అని దేవుడే చెబుతున్నాడు. దేవుని పని చేసే వారిని దేవుడు ఎప్పుడూ మరచిపోడు. ప్రజలు మన త్యాగాలని, మన పనిని గుర్తించకపోవచ్చు. దేవునికొరకు మనం తీసుకునే నిర్ణయాలు, ఎదుర్కొనే కష్టాలు, భరించే బాధలు అందరికీ తెలియక పోవచ్చు. సర్వజ్ఞానియైన దేవుడు మనల్ని దృష్టిస్తాడు, గుర్తిస్తాడు. మనలను చాలా గొప్పగా చూస్తాడు. ఆయన దృష్టిలో వారందరు ఆయనకు ప్రియులు, సన్నిహితులు.

### ముగింపు

ఎప్పుడో 2500 సంవత్సరాల క్రితం రాసిన ఈ పుస్తకం ఈనాడు మన పరిచర్య పరిస్థితులకు సందర్భానుసారమైనది. హగ్గయి గ్రంథం ద్వారా దేవుడు మన అందరితో మాట్లాడుచున్నాడు. మన వ్యక్తిగత జీవితంలో, పరిచర్య విషయంలోను హెచ్చరి కను, ధైర్యాన్ని ఇస్తున్నాడు. కాబట్టి పరిచర్యను భారంగానో, బాధ్యతగానో భావించక భాగ్యంగా ఎంచి పరిచర్యలో చురుకుగా పాల్గొందాం.

"ఉన్నది ఒకే జీవితం అదికూడా త్వరగా గతించిపోతుంది క్రీస్తు కోసం చేసింది మాత్రమే నిలిచిపోతుంది" అని సిటీ స్టడ్ చెప్పినట్టు మన జీవితాల్లో క్రీస్తు కోసం చేసింది మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతుంది కాబట్టి ప్రభువు పిలుపును నిర్లక్ష్యం చేయకుండా, పరిశుద్ధంగా జీవిస్తూ, ఆయన పనిలో ప్రోత్సాహం, గుర్తింపు ఉంటుందని ఎరిగి ప్రభువు కోసం అసాధారణమైన కార్యాలు చేద్దాం!

– శివరామకృష్ణ, స్టాఫ్, పిడుగురాళ్ళ



# దేవుని రాజ్యం

గత సంచిక తర్వాత..

## దేవుని రాజ్యం మన లక్ష్యం

దేవుని ప్రణాళికలో అంతర్భాగంగా, ప్రధాన లక్ష్యంగా, అతి ప్రాముఖ్యమైన అంశం ఆయన రాజ్యం, లేక కుటుంబం. తనను తాను కుటుంబంగా పరిచయం చేసుకున్న త్రియేక దేవుడు తన స్వరూపంలో తన పోలిక చొప్పున చేసుకున్న మానవాళి కూడా తన కుటుంబంలో భాగం అవ్వాలని, దేవుని రాజ్యమన్న పేరుతో నిత్యం విసిల్లాలనేది దేవుని ఆశ. అయితే పతనావస్థకు చేరిన మానవుని కొరకు దేవుని విమోచన ప్రణాళిక భాగంగా తన స్వంత కుమారుడిని వారి పాపస్థితినుండి విడిపించడానికి లోకానికి అనగా ప్రజల కొరకు పంపాడు తండ్రి. తండ్రి అభీష్టం నెరవేర్చే కుమారుడు, కుమారుడిని మహిమపరచే పరిశుద్ధాత్ముడు, కుమారుడిని దేవా అని పిలిచే తండ్రి, ఆత్మ వాక్యమే దేవుని వాక్యం అని చెప్పే కుమారుడు ఒకే కుటుంబంగా ముగ్గురు వ్యక్తులు ఒకరిని ఒకరు మహిమపరిచే అనూహ్యమైన నిత్య సంబంధాన్ని మానవాళికి చూపించి, అదే స్థితిలోనికి యేసు క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన తన పిల్లలను కూడా సమకూర్చాలన్న యోచన బైబిల్ సమగ్ర పరిశీలనకు సారాంశం అని చెప్పాలి, చెప్పే లేఖనాలను సమగ్రంగా పరిశీలించాలి.

మార్కు 1:15 – కాలము సంపూర్ణమైయున్నది, దేవునిరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచూ దేవుని సువార్త ప్రకటించుచు గలిలయకు వచ్చెను.

మత్తయి 4:17 – అప్పటినుండి యేసు పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను.

ఆ రాజ్యం గురించి అనగా ఆ తండ్రి కుటుంబం గురించి యేసు చేసిన బోధలు బైబిల్ అంతటిలోను కనిపిస్తుంటాయి.

మత్తయి 6:33 – కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి,అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. యేసు తన మానవ జీవన కాల వ్యవధిలో తన "తండ్రి రాజ్యం–తన రాజ్యం–పరిశుద్ధ రాజ్యం–నిత్య రాజ్యం" గురించే ప్రకటించాడే గానీ ఏదో కేవలం పరలోక ప్రాప్తిని గురించి మాత్రమే ప్రకటించి వెళ్ళిపోయాడు అని ప్రకటించే సంకుచిత సువార్త బైబిల్‌లో కనబడదు.

## దేవుని రాజ్యం ఎలా ఉంటుంది?

దేవుని రాజ్యము ఒక రాజకీయ నాయకుడు కట్టే రాజ్యాన్ని పోలి ఉండదు.

యేసు – నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు, నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు కదా (యోహాను 18:36).

రాజ్యం అనగానే అధికార దాహం, పొరుగు వారిపై పెత్తనం చేయడం, కొల్లగొట్టే విధానం, దోపిడీ, కుళ్ళు, కుతంత్రాలు, వెన్నుపోటు, ఈర్ష్య మొదలైన అంశాలు మరియు సామాజిక, వ్యక్తిగత, కుటుంబపరమైన హక్కులు, బాధ్యతలు, స్థితి, స్థాయి మొదలైన గౌరవ ప్రదమైన అంశాలను మట్టిలో కలిపే వ్యవస్థ మనకు కళ్ళముందు మెదలాడుతుంది. ఇది మన పాప పతన స్థాయికి పర్యవసానం. అధికారం ఉపయోగించి పొరుగు వానిపై పెత్తనం చేయడం, ఒకరి సామాజిక ఆధిక్యతను ఇంకొకరికి శాపంగా మారే విధంగా అధికార దుర్వినియోగం చేసే పద్ధతులు, ప్రభుత్వరంగంలో, వ్యాపార రంగంలో అధికార దుర్వినియోగం, ఇలా సమాజంలోని ప్రతి రంగంలోను ఒకరిని ఒకరు విభజించుకొంటూ, ఒకరిపై ఒకరి పెత్తనాన్నే అధికారం అనుకొంటూ దేవుని ప్రణాళికకు విరుద్ధంగా జీవించే జీవన విధానం ఈరోజు కనిపించే రాజ్యాలలో చూస్తాం. కానీ యేసు తన రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదని, అది దైవికమైనదని, సామాజిక విలువలతో కూడినదని చెప్పి అలాగే జీవించాడు.

లూకా 17: 20-21 లో దేవుని రాజ్యమెప్పుడు వస్తుందని పరిసయ్యులు అడిగినప్పుడు ఆయన – దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే ఉన్నది గనుక, ఇక్కడని, అక్కడని చెప్పడానికి వీలుపడదని వారికి ఉత్తరమిచ్చాడు.

రోమా14:17 – దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై ఉన్నది. ఈ మాటకు సందర్భానుసారమైన అర్థం గమనిస్తే భోజనాన్ని, పానీయాన్ని అడ్డం పెట్టుకుని ఒకరికి తీర్పు తీర్చటం క్రైస్తవ దృక్పథం కాదు. దేవుని రాజ్యం నీతి, సమాధానం, పరిశుద్ధాత్మయందలి ఆనందం అన్న అభౌతిక, ఆత్మీయ స్థితిని సూచిస్తుంది.

ఆ రాజ్య విలువలు మీకా 6:6లో "ఏమి తీసికొని వచ్చి నేను యెహోవాను దర్శింతును? ఏమి తీసికొని వచ్చి మహోన్నతుడైన దేవుని సన్నిధిని నమస్కారము చేతును? దహనబలులను ఏడాది దూడను అర్పించి దర్శింతునా? వేలకొలది పొట్టేళ్ళను వేలాది నదులంత విస్తారమైన తైలమును ఆయనకు సంతోషము కలుగజేయునా? నా అతిక్రమమునకై నా జ్యేష్ఠపుత్రుని నేనిత్తునా? నా పాపపరిహారమునకై నా గర్భఫలమును నేనిత్తునా? మనుష్యుడా, ఏది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది. న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సుకలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు."

మనకున్న మతం-దశమ భాగాలకు, సంభావనలకు, పండుగలకు, పబ్బాలకు, పెళ్ళిళ్ళకు, కావలసిన వనరుల కోసం దేవున్ని ప్రసన్నం చేసుకోవడానికి మాత్రమే పనికొస్తుంది తప్ప మన బాధ్యతైన న్యాయంగా నడుచుకోవడం, కనికరాన్ని ప్రేమించడం, దీనమనస్సు కలిగి దేవుని యెదుట ప్రవర్తించడం అన్న దేవుని రాజ్య విలువల్ని మాత్రం తుంగలో తొక్కుతున్నామేమో అన్నది ఆలోచించాల్సిన విషయం. ఈ 'దేవునిరాజ్యాన్ని' భారతదేశంలో విస్తరింపజేయడానికి తమ సొంత ఇల్లు, దేశాలు, కుటుంబాలు, సంస్కృతిని త్యజించి, మన దేశ పౌరుల ను అన్ని రకాల వివక్ష నుండి తప్పించి 'దేవుని రాజ్య స్థాపన' అనే పనికి మిషనరీలు పూనుకున్నారు. వారి రాక మన దేశం పాలిట వరంగా మారింది. వారి త్యాగ ఫలం ఈనాడు భారతదేశంలో క్రైస్తవ సంఘ ఆవిర్భావానికి నూతన మానవ సమాజానికి ప్రాణం అయ్యింది. వారి రక్తపు పెట్టుబడిపై ఈనాటి సామ్రాజ్యవాద పాస్టర్స్ తమ సొంత రాజ్యాలు కడుతున్నారన్నది కూడా విచారించ దగ్గ అంశం.

## మన బాధ్యత

క్రీస్తు సంఘానికీ, ఆయన రాజ్యానికి అవినాభావ సంబంధం ఉంది. క్రీస్తు సంఘము ఆయనను రాజుగా హృదయమందు ప్రతిష్టించుకొన్న వారి సముదాయమైతే ఆయన రాజ్యం మరింత సార్వత్రికంగా అన్ని రంగాల్లో విస్తరించి ఉంటుంది. క్రీస్తు సంఘము ఆయన శరీరము కనుక ఆ సంఘస్తులకు క్రీస్తు భుజముపై ఉన్న రాజ్య భారం ఉంటుంది. క్రీస్తు శరీరానికి లేక సంఘానికి ఉన్న

ప్రధాన బాధ్యత దేవుని రాజ్యాన్ని సృష్టిలో తిరిగి తీసుకు రావడమే. ప్రతి రంగాన్ని తిరిగి క్రీస్తు కొరకు విడిపించడం/విమోచించడమే సంఘానికున్న ప్రధాన బాధ్యత. పరిశుద్ధాత్ముని వరము కలిగి ఆయన ఫలాన్ని సమాజంలో అనగా సృష్టి యావత్తులో విస్తరింపజేయడమే సంఘం ముందున్న ప్రధాన లక్ష్యం.

'ఎక్లీసియా' అన్న గ్రీకు పదానికి సంఘము అనే పదాన్ని తెలుగు బైబిల్ తర్జుమాలో వాడారు. 'ఎక్లీసియా' అన్న పదం చరిత్రలో కేవలం యేసు మాత్రమే వాడలేదు. ఆయన కంటే ముందు గ్రీకులు తమ జ్ఞానాన్ని, తత్వ శాస్త్రాన్ని పలుదేశాలకు చేరవేయడానికి, వారి ప్రభావాన్ని ఇతర దేశాల పై చూపడానికి, వారు చెరపట్టిన రాజ్యాలలోనికి "ఎక్లీసియా" అనే ఒక స్వతంత్ర లేక స్వచ్ఛంద మానవ గుంపును పంపేవారు. వారు జీత భత్యాలకు కాక గ్రీకు తత్వానికి, వారి సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు కట్టుబడి అంకిత భావం కల వారై వెళ్ళిన ప్రతి చోటా గ్రీకు సంస్కృతి, తత్వాన్ని నూరి పోసేవారు. తర్వాత రోమీయులు గ్రీకులను ఓడించి రాజ్యం పొంది వారు కూడా "ఎక్లీసియా" అనే సమాజాన్ని వారి కైసరు మహిమ, యుద్ధ పఠిమ, భవన నిర్మాణ సాంకేతికత, ధరించే బట్టలు, వైభవం మొదలైన వాటిని చెరపట్టిన రాజ్యాలలో విస్తృతం చేయడానికి ఉపయోగించారు. ఆ నేపథ్యంలో యేసు తన శిష్యులను 'ఎక్లీసియా' అని పిలిచాడు. అప్పటికే ఆయన పుట్టి పెరిగిన సంస్కృతిలో 'సినగోగు' లేక 'సమాజ మందిరం 'అనే సంస్కృతి ఉంది.

మతమే ఆయనకు ప్రధానమైతే ఆయన ఇంకో సినగోగు స్థాపించేవాడు కానీ యేసుకున్న ప్రధాన లక్ష్యం ఆయన రాజ్యం గనుక ఆ రాజ్య స్థాపనకు అనువైన పద్ధతి అయిన 'ఎక్లీసియా' అనే సమాజాన్ని ఎన్నుకున్నాడు. "ఎక్లీసియాగా" పిలిచిన తన శిష్యగణం 'యేసే' 'క్రీస్తు' లేక 'రాజు/ప్రభువు' లేక సువార్తతో ప్రపంచాన్ని తల క్రిందులు చేయసాగారు. అపొస్తలుల కార్యము 17:1-9 వరకు పౌలు చేసిన ప్రకటన యేసే క్రీస్తు అని కదా. ఆయన క్రీస్తు అనగా దానియేలుకు కనిపించిన నిత్య రాజ్యమును స్థాపించు క్రీస్తు గురించే ప్రకటిస్తూ తిరిగాడు. అది అక్కడి యూదులకు అర్థం అయ్యింది కాబట్టే కైసరు కాకుండా వేరొక రాజున్నాడని వీరు బోధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గనుక క్రైస్తవ సంఘమంటే దేవుని రాజ్య స్థాపనకు ప్రభువు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించే సమాజమే కానీ మత ప్రాతిపదికన యేదో కొన్ని కార్య కలాపాలు చేసే సంఘం కానే కాదు. క్రైస్తవ సంఘ ప్రధాన లక్ష్యం కేవలం చచ్చిపోయి పరలోకం పోవడం కాదు కానీ బ్రతికి ఉండగానే దేవుని రాజ్యం నిర్మించడం. మానవ జీవన ప్రతిరంగంలో యేసు క్రీస్తు ప్రభుత్వాన్ని ఆయన వాక్య విలువల ద్వారా నిర్మించడం.

మత్తయి 6:9-10లో కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి - పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక.

దేవుని చిత్తం గురించి కేవలం క్రైస్తవ సంఘాల్లో, క్రైస్తవుల ఇళ్ళల్లోనే అని ఆలోచించేవారు అక్కడే నిలురించబడతారు. దేవుడు అందరికీ తండ్రియని, ఆయన చిత్తం పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమిమీద అన్ని రంగాల్లో, అన్ని కుటుంబాల్లో, అన్ని సమాజాల్లో, అన్ని వ్యాపారాల్లో, అన్ని ప్రభుత్వాలలో నెరవేరాలన్నది దేవుని ఆశ. ఆ దిశగా వ్యూహం, ఆ దిశగా ప్రణాళికతో కూడిన కార్యాచరణ చేయడం యేసుప్రభువు రక్తంచే కొనబడిన దేవుని సంఘ కర్తవ్యం. ఇలాంటి రాజ్యస్థాపన, విస్తరణ కేవలం ఆత్మీయమైన వారికే సాధ్యం.

మతం, దేవుని సంతోషపరచాలన్న కోరికను కుంటుపరచి లేక వాడుకొని కేవలం కొన్ని కార్యాలకు పరిమితం చేస్తూ మనిషిని మరణానంతర జీవితం వైపు దృష్టి ఉంచే విధంగా ప్రోత్సహిస్తుంది. కానీ 'రాజ్య దృక్పథం' మనిషికి ఈలోకంలో దేవుని రాజ్యాన్ని స్థాపించాలన్న తీవ్రతను ఇస్తూ సృష్టిని విమోచకుని రాకకు సిద్ధపరుస్తూ క్రీస్తులోని నూతన, రూపాంతర మార్పు కోసం శ్రమించమంటుంది. మనం కేవలం మతానికి పరిమితమైపోతామో లేదా దేవుని రాజ్య దృక్పథం కలిగి జీవిస్తామో నిర్ణయించుకోవాలి. మన ముందు నడిచిన విశ్వాస యోధులందరూ సైనికులై, కర్షకులై, దూతలై, అధికారులై దేవుని రాజ్యం కోసం పనిచేశారు. మన పాత్ర ఏంటి? మనం కూడా దేవుని రాజ్యం కోసం పనిచేద్దామా?

**- ప్రవీణ్ కుమార్ పగడాల,** హైదరాబాద్



# క్రైస్తవ తల్లుల అవసరత

అవిశ్వాసం, స్వార్థం, అపవిత్రత అనే దెబ్బలకు క్రైస్తవ కుటుంబ పునాదులే కదిలిపోతున్న ఈ కాలంలో మాతృత్వం అను అంశాన్ని లోతుగా తెలుసుకోవాల్సిన అవసరం చాలా ఉన్నది.

గొప్ప తల్లులు లేకపోతే గొప్ప స్త్రీ, పురుషులు ఉండరు. "నేను ఏమైఉన్నానో, ఏమి అవ్వాలని ఆశిస్తున్నానో దానంతటికీ కారణం మా అమ్మే. అందుకే నేను ఆమెకు ఎంతో రుణపడిఉన్నాను" అని అబ్రహాం లింకన్ అన్నాడు.

స్త్రీ జాతి పవిత్రతని, గొప్పతనాన్ని మనం గౌరవిస్తాము. స్త్రీలు గుర్తించినా, గుర్తించకపోయినా ఒక విషయం మాత్రం నిజం. క్రైస్తవ్యంలోనే వారు పురుషులతో సమానులుగా పరిగణింపబడతారు. ఇందుకు వారు క్రీస్తుకు ఎంతో ఋణపడిఉన్నారు. ఇప్పటికీ చాలా దేశాల్లో, ఈ రోజుల్లోకూడా స్త్రీని అడవిజంతువు కన్నా హీనంగా చూస్తారు. స్త్రీ జాతిని ఉన్నతంగా గౌరవించింది యేసుక్రీస్తు మాత్రమే.

ఈ ప్రపంచం ఎంతో అద్భుత నివాసయోగ్యమైన ప్రదేశంగా మార్చడానికి కృషి చేసిన స్త్రీలను గూర్చి, దేవుని రాజ్యాన్ని వ్యాపింపజేయడానికి కృషి చేసిన ఎంతోమంది స్త్రీలను గూర్చి బైబిల్‌లో రాయబడింది.

ఇశ్రాయేలీయులు ఎఱ్ఱసముద్రాన్ని దాటిన తర్వాత ఆనందభరితులైన స్త్రీలకు నాయకత్వం వహించి మిర్యాము ఇలా పాడింది. "యెహోవాను గానము చేయుడి. ఆయన మిగుల అతిశయించి జయించెను (నిర్గమ 15:21). రూతు అన్నిటికన్నా దేవునికే మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఫలితంగా దావీదు మహారాజు వంశస్తురాలైంది (రూతు 1:16; 4:17). ఇశ్రాయేలీయుల న్యాయాధిపతిగా దెబోరా ఉన్నది (న్యాయా 4:4,5). తన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఎస్తేరు నాశనమైపోతున్న తన ప్రజల కోసం విజ్ఞాపన చేసింది (ఎస్తేరు 4:10-16). ఒక స్త్రీలో కలిగిన కృతజ్ఞతాభావం ఆమె కన్నీళ్ళతో ప్రభువు పాదాలను కడిగేటట్లు చేసింది (లూకా 7:38). సువాసననిచ్చే అత్తరుతో ప్రభువును అభిషేకించిన మరియ పునరుత్థానుడైన ప్రభువును మొదటిగా చూసింది, "వెళ్ళి చెప్పు" అన్న ప్రేషిత ఆజ్ఞను మొదట పొందినది (యోహాను 20:17,18; మార్కు 16:9). దేవుని వెంబడించిన, బైబిల్‌లో రాయబడిన చాలా మందిని గూర్చి మనం చెప్పుకోవచ్చు.

కుటుంబంలో తల్లి చాలా కీలకమైన వ్యక్తి అని బైబిల్ చెబుతుంది. ఒక పురుషుడు తన భార్య పట్ల చూపించే ప్రేమ మీద ఆధారపడిన ఒక క్రైస్తవ వ్యవస్థే కుటుంబం. పెండ్లి కుమార్తె అయిన సంఘమును క్రీస్తు ప్రేమించిన విధానమే దీనికి కారణం. కాని ఈ రోజుల్లో కుటుంబం అను వ్యవస్థకు నిర్వచనం

బాగా మారిపోయింది, దిగజారిపోయింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి.

కుటుంబంలో క్రీస్తు కొరకు జీవించడం క్రైస్తవునికి కఠోరమైన పరీక్ష. నీ స్నేహితుల మధ్య ఒక అద్భుతమైన వ్యక్తిగా జీవించడం చాలా సులభం. ఇతరులు నీ గూర్చి మంచి అభిప్రాయాన్ని కలిగి ఉండేటట్లు నీవు మంచి దుస్తులు, పాదరక్షలు ధరిస్తావు. కాని నీ కుటుంబంలో నీవు క్రీస్తు కొరకు జీవించడం దానికన్నా చాలా కష్టం. నీలో, నీద్వారా క్రీస్తు జీవిస్తున్నాడా లేదా అన్న విషయం నీ కుటుంబ సభ్యులు గమనిస్తారు.

నీవు నిజమైన క్రైస్తవుడవైతే ముక్కోపము, అసహనం, తప్పులు ఎంచడం, ఎత్తిపొడుపు మాటలు, నిర్దయ, అనుమానం, స్వార్థం, బద్ధకం వంటి చెడు లక్షణాలు నీ కుటుంబంలో ప్రదర్శించవు. దీనికి భిన్నంగా నీ అనుదిన జీవితంలో నీ కుటుంబంలో ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం మొదలగు ఆత్మఫలమైయున్న లక్షణాలను, క్రైస్తవ సుగుణాలను ప్రదర్శిస్తావు. ఇవి క్రీస్తును పోలిన వ్యక్తిత్వపు లక్షణాలు.

నీ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు, నీవు పచారి సరుకులు కొనే షాపు యజమాని, పోస్ట్‌మేన్, వార్తాపత్రికను నీ ఇంటికి తెచ్చే వ్యక్తి మొ॥ వారందరు నీవు చాలా భక్తిగల క్రైస్తవుడవని, నీవు జీవించే ప్రతి నిమిషం క్రైస్తవ విలువలతో జీవిస్తావని గుర్తిస్తారు. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను శ్రేష్టమైన నిబంధన శ్రామికులకు, నీ వ్యాపార భాగస్తులకు మాత్రమే గాక, నీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా వర్తిస్తుందని నీవు తెలసుకొంటావు.

పవిత్రమైన క్రైస్తవ తల్లులు మన దేశానికి ఎంతో అవసరం. క్రైస్తవ తల్లులు ఎక్కువమంది ఉంటే అపవిత్రత, భక్తిహీనత, చిద్రమౌతున్న కుటుంబాలు ఎంతో గణనీయంగా తగ్గుతాయి. అప్పుడే ఆమె క్రీస్తు తనకు ఇచ్చిన పిల్లలను సరైన విధానంలో ప్రభావితం చేయగలుగుతుంది. తల్లి తన పిల్లల పై చూపెట్టే ప్రభావాన్ని మనం కొలవలేము. ఆమె మాదిరిని, నిజాయితీని, అలవాట్లను, దయాగుణాన్ని, కష్టించి పనిచేసే తత్వాన్ని పిల్లలు గ్రహిస్తారు, అనుకరిస్తారు. ప్రపంచంలో అత్యంత కష్టమైన పనులలో ఒకటి ఏమిటంటే ప్రస్తుత దుష్టకాలంలో పిల్లలను, కుటుంబాన్ని ప్రభువు నందు విశ్వాసం, వాక్యపు బోధలలో పెంచడమే. వార, మాస పత్రికల్లో వస్తున్న అసభ్యకరమైన విషయాలు, కథలు, స్కూల్స్‌లో ఉంటున్న అనైతిక పరిస్థితులు, ఇంతకుముందు తరంవారికి తెలియని మరెన్నో వందల, వేల శోధనలు ఉంటున్న ఈ కాలంలో దేవుని భయంలో పిల్లలను పెంచడం దేవుని కృపతోనే సాధ్యం. తల్లులు కేవలం తమ స్వంత శక్తితో దీనిని చేయలేరు. తమ పిల్లల కోసం తల్లులు మోకరించి ప్రార్థించినప్పుడే ఇది చేయగలరు.

బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు (సామె 22:6) అని బైబిల్ చెబుతుంది. తల్లిగా నీవు చేయవలసిన మొదటి, అత్యంత ప్రాముఖ్యమైన పని ఏంటంటే నీ పిల్లలు క్రీస్తును అంగీకరించేటట్లు చేయడం. వీరు ఆయనను నమ్ముకొంటే మిగతా అన్నివిషయాలు చక్కబడతాయి. శిక్షణను, క్రమశిక్షణను వారు ఇప్పుడు ఇష్టపడకపోయినా దాని గొప్పతనాన్ని వారు తర్వాత అర్థంచేసుకొంటారు. నిన్ను ధన్యురాలని అంటారు (సామె 31:28).

నా తల్లిదండ్రులు నన్ను సండేస్కూలుకు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం మా అమ్మ మాకు బైబిల్ కథలు చెప్పేది. ఆమె చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, మత సంబంధమైన విషయాలు బలవంతంగా నాకు ఎక్కిస్తుందని అనుకొని నేను ఆమె మీద తిరగబడేవాడిని. కాని తర్వాత ముఖ్యంగా ప్రతి మదర్స్‌డే రోజున నా చిన్నతనంలో నా తల్లి, నా తండ్రి దేవుని విషయాల్లో నాకు ఇచ్చిన శిక్షణ నా జీవితాన్ని మార్చివేసిందని చెబుతూ ఆ శిక్షణ పట్ల నాకు ఇప్పుడు కలుగుతున్న ప్రేమను, అభినందనను నా తల్లికి తెలియజేస్తుంటాను.

నీ పిల్లలు క్రీస్తును అంగీకరించారా? వారిని క్రీస్తు కొరకు గెల్చుటకు నీ శక్తినంతా ధారపోసినా లాభంలేకుండా పోయిందా? వారు క్రీస్తును ప్రభువుగా అంగీకరించకపోతే, వారు జీవించవలసిన విధంగా జీవించపోతే మరి ఎక్కువగా వారి కొరకు ప్రార్థించు.

(డెసిషన్ మ్యాగజైన్ నుండి సంగ్రహించినది)

**– డా॥ బిల్లీగ్రేహం**



# పాపాన్ని విడిచిపెట్టావా?

తుళ్ళిపడి లేచాడు అరుణ్. గోడ గడియారం చప్పుడు తప్ప గదంతా నిశ్శబ్దంగా ఉంది. స్నేహితులంతా ఒకరి మీద ఒకరు కాళ్ళేసుకుని మత్తుగా నిద్రపోతున్నారు. రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల కళ్ళు మంటగా అనిపించసాగాయి. తన పక్కన ఎవరో నిలబడి 'ఓయీ నిద్రబోతా! నీకేమి వచ్చింది? లేచి నీ దేవుని ప్రార్థించు' అని హెచ్చరిస్తున్నట్లుగా అనిపించింది. కళ్లు తెరచి చూస్తే ఎవరూ కనిపించలేదు.

నుదుటిమీద చెమట బిందువులను తుడుచుకుని ఆలోచనలో పడ్డాడు అరుణ్. స్నేహితుడి బలవంతం మీద నెలక్రితం జరిగిన ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కి హాజరయ్యాడు. వెళ్ళాలి కనుక వెళ్ళాడు కానీ అక్కడ జరుగుతున్న దేనిమీద మనసు లగ్నం చేయలేకపోయాడు. చెప్తున్న వాళ్ళ వైపు కళ్ళప్పగించి మనసును మాత్రం నచ్చిన అంశాల మీదకి మళ్ళించాడు. ఇంటిదగ్గరున్నప్పుడు ఆదివారాలు మాత్రమే చర్చ్‌కి వెళ్ళి, మిగతా రోజులన్నీ తన ఇష్టానుసారం జీవించాడు. ఇప్పుడు మాత్రం రూమ్మేటుతో కల్సి వారంలో ఏ రోజూ ఖాళీ లేకుండా ఏదో ఒక కార్యక్రమానికి హాజరవుతున్నాడు. అక్కడికెళ్ళాక జరుగుతున్నవన్నీ కొత్తగా అనిపిస్తున్నాయి గానీ, స్నేహితుడి కోసం తప్పదన్నట్లుగా ఉండిపోయేవాడు.

'పాపాన్ని ఒప్పుకోవడం గురించి, యేసును సొంత రక్షకుడిగా అంగీకరించడం గురించి, దేవున్ని హృదయంలోకి ఆహ్వానించాక కలిగే నూతనత్వం గురించి, బైబిల్ లేఖనాలను అర్థం చేసుకోవడం గురించి, లోకాశలకు లొంగకుండా మనసును పవిత్రంగా ఉంచుకొంటూ దేవునితో సంబంధాన్ని కలిగివుండడం గురించి, వాక్యంలో ఎదగడం గురించి, యవ్వన కాలంలో వచ్చే శోధనలు, వాటినెలా జయించాలనే విషయాల గురించి' ఎంతో ఆసక్తిగా చెప్తున్నా అరుణ్ మనసు మాత్రం సగం మనసుతోనే వినీ విననట్లుగా ఉండిపోయేవాడు.

ఇంతకీ తను తన పాపాన్ని ఒప్పుకున్నాడో లేదో తేల్చుకోలేకపోయాడు. పాపాన్ని ఒప్పుకోవడానికి కావలసిన పశ్చాత్తాపం తన హృదయంలో కలిగిందో లేదో గుర్తించలేకపోయాడు. లోకానికి దూరంగా, ప్రభువుకు దగ్గరగా ఉండడమంటే ఏంటో అర్థం చేసుకోలేకపోయాడు. యేసుక్రీస్తును సొంత రక్షకునిగా అంగీకరించినట్లు అందరూ చేతులెత్తితే తను కూడా చెయ్యెత్తాడు. అలా చేయెత్తకపోతే మిగతా వాళ్ళు ఏ మనుకుంటారో అని భావించాడు గానీ వాక్యం పట్ల తన విధేయతను ప్రకటించలేకపోయాడు. 'యేసు దేవుడ'ని నోటితో అంగీకరించాడు కానీ ఆ యేసుక్రీస్తును హృదయంలోకి ఆహ్వానించలేకపోయాడు. ఎందుకంటే.. ఎక్కడ లోకానికి, స్నేహితులకు దూరం కావలసి వస్తుందోనని!

**వాళ్ళతో తిరిగితేనే తనను గుర్తిస్తారని, తనకు తానే సృష్టించుకున్న మాయా ప్రపంచంలో తనెంతో ఆనందాన్ని అనుభవించాననే భ్రమలో ఇన్నాళ్ళూ జీవితాన్ని గడిపేశాడు. చూస్తుండగానే వేళ్ళ సందుల్లో నుంచి నీళ్ళు జారి పోయినట్లుగా... తన అలవాట్లు తనను ఏదో తెలియని లోకానికి ఈడ్చుకొనిపోతుంటే గుర్తించలేని గుడ్డితనంలో ఉన్నాడు ఇన్నాళ్ళు. కానీ ఇక్కడ మాత్రం అంతా కొత్తగా ఉంది! తను ఇప్పటిదాకా చూడని, అనుభవించని కొత్తలోకంలోకి అడుగు పెట్టినట్లుగా అనిపించింది.**

క్యాంప్‌లో సీనియర్ అన్నవాళ్ళు తమ తమ అనుభవాలను చెప్తుంటే వాళ్ళ వంక అయోమయంగా చూశాడే తప్ప అందులోని లోతును అర్థం చేసుకోలేకపోయాడు. ఏదో నలుగురూ కలుస్తారు, కాసేపు ఎంజాయ్ చేసినట్లుంటుందని వెళ్ళాడు తప్ప మనస్ఫూర్తిగా పాల్గొనలేకపోయాడు.

ప్రతీరోజూ ఐదుగంటలకే లేచి 'క్వైట్ టైం' చేసుకొని పడుకునే కిరణ్ వంక చూశాడు. 'అస్తమానం ఎక్కడో ఒకచోట మీటింగ్ ఉంది రమ్మని పిలిస్తే' అరుణ్ విసుక్కొనేవాడు. మొదట్లో చాలాసార్లు ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకొనేవాడు. కానీ కిరణ్ వదలకుండా ఆహ్వానిస్తూ ఉండడంతో తప్పేది లేక వెళ్ళాడు. అక్కడికెళ్ళాక అందరూ తన వయసువాళ్ళే కనిపించడంతో హాయిగా ఊపిరి పీల్చుకొన్నాడు.

'కొత్తగా వచ్చే సినిమా కబుర్లు, రోజురోజుకీ మారిపోతున్న ఫ్యాషన్స్, వాటిని అనుకరించడానికి నేటి యువలోకం పడుతున్న తిప్పలు, యువతీ యువకుల మధ్య ఉండే ప్రేమ మాత్రమే గొప్పదని చూపించే సినిమాలు, అలాంటి ప్రేమ కోసం అవసరమైతే తల్లిదండ్రుల్ని కూడా ఎదిరించాలని సందేశాన్నిచ్చే కథలు, మొబైల్ తప్ప వేరే అద్భుత ప్రపంచం ఏదీ లేదన్నట్లుగా టైమంతా అందులో గడిపే యూత్, చెడు అలవాట్లకు, చెడు పనులను బానిసలై భవిష్యత్తును పాడుచేసుకుంటున్న యువత...' ఇప్పటిదాకా అరుణ్ చూసిన స్నేహితులంతా ఇలాగే కనిపించారు.

ఎప్పుడు వాళ్ళతో కలిసినా లోకానికి సంబంధించిన కబుర్లు దొర్లేవే కానీ, దేవుడు, పాపం అనే విషయాలకు తావుండేది కాదు! వాళ్ళతో తిరిగితేనే తనను గుర్తిస్తారని, తనకు తానే సృష్టించుకున్న మాయా ప్రపంచంలో తనెంతో ఆనందాన్ని అనుభవించాననే భ్రమలో ఇన్నాళ్ళూ జీవితాన్ని గడిపేశాడు. చూస్తుండగానే వేళ్ళ సందుల్లో నుంచి నీళ్ళు జారి పోయినట్లుగా... తన అలవాట్లు తనను ఏదో తెలియని లోకానికి ఈడ్చుకొనిపోతుంటే గుర్తించలేని గుడ్డితనంలో ఉన్నాడు ఇన్నాళ్ళు. కానీ ఇక్కడ మాత్రం అంతా కొత్తగా ఉంది! తను ఇప్పటిదాకా చూడని, అనుభవించని కొత్తలోకంలోకి అడుగు పెట్టినట్లుగా అనిపించింది. వాక్యం వింటున్నప్పుడు, సమూహంతో కలిసి చదువుతున్నప్పుడు ఎవరో ఎదురుగా నిలబడి తనతో మాట్లాడుచున్నట్లుగా అనిపించేది. అక్కడికి వచ్చిన వాళ్ళలో ఎవరి నోటివెంట విన్నా దేవుడికి సంబంధించిన విషయాలు తప్ప మరే విషయాలూ వినిపించకపోవడం ఒకింత ఆశ్చర్యంగానూ, మరి కొంత అసంతృప్తిగానూ అనిపించింది.

నిజమే... మన సృష్టికి ఆధారభూతమైన వాడు... దేవుడు!

మన పోషకుడు, పాప విమోచకుడు, రక్షకుడు... దేవుడు!

ఆయువు పోసినవాడు, ఊపిరి ఊదినవాడు... దేవుడు!

అందరూ ఒప్పుకున్నట్లుగా తనెందుకు ఈ విషయాల్ని ఒప్పుకోలేకపోతున్నాడు? వ్యర్థమైన వాటిని విడిచిపెట్టి దేవునిని ఎందుకు వెంబడించలేకపోతున్నాడు? అన్నీ సమకూర్చిన దేవుని సన్నిధిని ఎందుకు అనుభవించలేకపోతున్నాడు? ప్రశ్నల వెంట ప్రశ్నలు అరుణ్‌ని ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి.

ఒక్కసారిగా అరుణ్‌కి తన వ్యక్తిగత జీవితం, తను గతంలో చేసిన పాపాలు గుర్తొచ్చాయి. 'బాగుపడ'మని నిరంతరం చెప్పే తల్లిదండ్రులు గుర్తొచ్చారు. ఇన్నాళ్ళూ బాగుపడడమంటే.. బాగా చదివి, మంచి ఉద్యోగం తెచ్చుకొని, నలుగురిలో గౌరవంగా బతకడం అనుకున్నాడు! ఇష్టానుసారంగా జీవిస్తూ దేవునిలో ఉన్నట్లుగానే ఉంటూ దేవునికి దూరంగా జీవించడం అనుకొన్నాడు. హృదయం, శరీరం పవిత్రంగా లేకపోయినా నలుగురి కోసం కేవలం

పెదవులతో దేవునిని ఆరాధిస్తే చాలని అపోహపడ్డాడు. కానీ... ఇక్కడేమిటి ఇంత కొత్తగా ఉంది?

తనతో వచ్చిన వాళ్ళంతా దేవుడితో తమకున్న వ్యక్తిగత సంబంధాన్ని వివరిస్తుంటే, దేవుడు తమతో ఎలా మాట్లాడాడో వివరిస్తుంటే, పాపానికి ఎలా దూరంగా ఉన్నారో వాళ్ళు చెబుతుంటే వాళ్ళను పిచ్చివాళ్ళను చూసినట్లుగా చూశాడు. 'రుచి చూసి తెలుసుకోమంటే' బాగుంది, బాగోలేదని చెప్పడమనుకొన్నాడు. కానీ వాక్యాన్ని అర్థం చేసుకుని, దేవుని ప్రేమను గుర్తించి, హృదయంతో ఆరాధించడమని తెలుసుకోలేకపోయాడు. తను నిలబడ్డాననుకొని పడిపోతున్నాడో, పడిపోయాక ఇప్పుడు నిలబడడానికి ప్రయత్నం చేస్తున్నాడో అర్థం కాలేదు అరుణ్‌కి.

ఇన్నాళ్ళూ నామకార్థ క్రైస్తవుడిగా, గుంపులో ఒకడిగా ఉన్నందుకు అరుణ్‌లో ఒక్కసారిగా ఎంతో వేదన కలిగింది. తాను చేసిన తప్పులు తన కాళ్ళకు సంకెళ్ళుగా మారి దేవునిని వెంబడించడానికి అడ్డంకిగా మారిపోయాయి. ఆ సంకెళ్ళను బద్దలు కొట్టాలంటే తానొక వెలిగించిన దీపంగా మారాలి. ఆ దీపాన్ని మంచం కిందో, కుంచం కిందో పెట్టకుండా పదిమందిని ఆ వెలుతురులో నడిపించాలి. నిరాశలోనూ, నిస్పృహలోనూ కొట్టుమిట్టాడుతున్న యువతకు ఆ వెలుగును పంచాలి. ఇవన్నీ జరగాలంటే ముందు తాను తన పాత జీవితాన్ని వదిలేయాలి. పాపాలను ఒప్పుకుని దేవునిని క్షమాపణలు అడగాలి. యేసుక్రీస్తునందు విశ్వాసముంచాలి. వాక్యాన్ని ఆయుధంగా ధరించి వ్యక్తిగత ప్రార్థనలో సమయం గడపాలి.

మంచం మీద నుండి కిందకి దిగి మోకాళ్ల మీద నిలబడి 'ప్రభువా! నా చేయి పట్టుకో. నేను నడవవలసిన దారి నాకు చూపించు. నా పాపాలు క్షమించు. నాలాంటి ఎందరికో మాదిరిగా ఉండే బిడ్డగా మారడానికి నీ కృపను నాకు దయచేయి, ఆమేన్" అని ప్రార్థించాడు. తనలోని సంఘర్షణ తొలగిపోయి దేవుని సమాధానంతో అరుణ్ నింపబడ్డాడు. ఇక అప్పటి నుండి ఇష్టంగా, సంతోషంగా బైబిల్ స్టడీస్‌కి, కార్యక్రమాలకు, చర్చ్‌కి వెళుతున్నాడు.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు

# Crossword Puzzle

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | | 3 | | | |
| | 4 | | 5 | | | | 6 | 7 |
| 8 | | | | | | | | |
| | | | | 9 | | | | |
| | | | | | | | | |
| 10 | | | | | | | | |

**Horizontal**

1. The manwhose ways contradicted his name
4. A Benzamine, the son of Jesaiah
8. Son of Zeror, father of Ner and Kish
9. Son of Jopheth (name of a country in Asia Minor)
10. The Man who had God's ear, a Nazarite

**Vertical**

2. Son of Gerhon and Grandson of Levi
3. The royal author of Proverbs 31:1
5. Second son of Canaan, ancestor of the Hittites
6. Son of Hothan, the Aroerite.
7. Second son of Reuben, and founder of a tribal fly




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| A | S | A | H | E | L | E |
| A | A | S | A | L | O | N |
| M | | | M | I | T | O |
| R | | I | S | S | A | C |
| A | J | O | S | I | A | H |
| M | A | T | T | H | E | W |

1. *M. Ankarao, Guntur*
2. *R. Suma Srinivas, Guntur*

## కోశాధికారి లేఖ

# అక్కరలు తీర్చే ప్రభువు

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో వందనాలు.

*"అంతట ఆయన ఆ అయిదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని, ఆకాశమువైపు కన్నులెత్తి ఆశీర్వదించి ఆ రొట్టెలు విరిచి వడ్డించుటకు తన శిష్యులకిచ్చి, ఆ రెండు చేపలను అందరికిని పంచి పెట్టెను"*

*- మార్కు 6:41*

ఒక చిన్నవాడు ఐదు రొట్టెలు, రెండు చేపలు ప్రభువుకు ఇచ్చాడు. ప్రభువు వాటిని పట్టుకొని ఆశీర్వదించాడు. అది ఆ పిల్లవానివద్ద ఉంటే వాని ఒక్కడికే సరిపోతుంది. ప్రభువు చేతికియ్యగా ప్రభువు వాటిని ఆశీర్వదించగా స్త్రీలు, పిల్లలు కాగా తినిన వారు ఇంచుమించు ఐదువేల మంది పురుషులు. వారందరు తిని తృప్తిపొందిన తర్వాత మిగిలినవి పన్నెండు గంపలకు ఎత్తారు. గనుక మన వద్ద ఉన్న కొంచెం ప్రభువుకిస్తే, అనగా ప్రభువు చేతిలో పెడితే ఆయన ఆశీర్వదించి మన యుఇయస్ఐ పరిచర్య అవసరాలన్నీ తీర్చుతాడు. ఎల్లప్పుడూ మిగులే గాని కొదువ ఉండదు. అందుకే దావీదు రాజు కీర్తన 23:1లో యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు అని రాశాడు.

గత అనేక సంవత్సరాలుగా ఆయన వైపు చూస్తూ, మన ప్రతి అవసరానికి ఆయన మీద ఆధారపడుతున్నప్పుడు అద్భుతంగా మన అక్కరలన్నీ తీర్చుతున్నాడు. మన కుటుంబాల్లో కూడా అవసరాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికోసం మనం ప్రభువువైపే చూడాలి. ఇది వాక్యానుసారం, మన పితరులు మనకు నేర్పిన మాదిరి. ఈ సూత్రాన్ని మనం ఎప్పుడూ మరచిపోకూడదు.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపించేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**

**JULY 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 2,036.00 | Field Staff Salaries | 4,84,735.00 |
| General Fund | 10,57,373.00 | Field Staff HRA, CA, MA & TA | 2,89,487.00 |
| Staff Support | 1,08,500.00 | Office Staff Salaries | 1,95,287.00 |
| | | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Dept. | 3,500.00 |
| | | Office Expenditure | 24,057.00 |
| | | SWF | 42,000.00 |
| | | Closing Balance | 843.00 |
| **Total** | **11,67,909.00** | | **11,67,909.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-08-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# Making Sense of the Ministry

1. The foundation of ministry is character.
2. The nature of ministry is service.
3. The motive for ministry is love.
4. The measure of ministry is sacrifice.
5. The authority of ministry is submission.
6. The purpose of ministry is the glory of God.
7. The tools of ministry are the Word and prayer.
8. The privilege of ministry is growth.
9. The power of ministry is the Holy Spirit.
10. The model for ministry is Jesus Christ.

*Warren W Wiersbe & Davie Wiersbe*

